## నామినేషన్లు ముగిసినా ఖరారు కాని కాంగ్రెస్ అభ్యర్థులు
## బి ఫాం కోసం ఆశావహుల్లో టెన్షన్ టెన్షన్

**జహీరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:**
జహీరాబాద్ మున్సిపాల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్‌ల పర్వం శుక్రవారంతో ముగిసినా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థుల జాబితా ఇంకా విడుదల కాకపోవడంతో నామినేషన్ వేసి అభ్యర్థులు పార్టీ బి ఫాం కోసం టెన్షన్ టెన్షన్ పడుతున్నారు. పార్టీ అధిష్ఠానం తనకే అవకాశం కల్పిస్తుందన్న నమ్మకంతో మున్సిపల్ పరిధిలోని 37 వార్డులకు కాంగ్రెస్ తరపున 126మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఫిబ్రవరి 2వ తారీఖు వరకు పార్టీ అధిష్ఠానం బి ఫాంలు జారీచేసే అవకాశం ఉండటంతో తమకే బి ఫాం అంటూ అభ్యర్థులు తమ సన్నిహితుల వద్ద చెప్పుకుంటున్నారు. పార్టీలోని ముఖ్యనాయకుల మధ్య సఖ్యత లేమితోనే అభ్యర్థుల ఖరారులో ఆలస్యమవుతోందని తెలుస్తోంది. కాంగ్రెస్ బి ఫాం ఇవ్వకుంటే స్వతంత్రంగా అయినా పోటీచేస్తామని కొందరు బహిరంగంగా చెబుతున్నట్లు తెలుస్తోంది.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## అన్వేషణ సైన్స్ ప్రోగ్రాంలో శివంపేట విద్యార్థుల ప్రతిభ
### విద్యార్థులను అభినందించిన ఇస్రో వైస్ చైర్మన్ రఘునందన్ నాయర్

**చౌటకూరు, జనవరి 31, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని శివంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఇస్రో వైస్ చైర్మన్ రఘునందన్ నాయర్ ప్రత్యేకంగా అభినందించారు. ఆగస్త్య ఫౌండేషన్-జెఎన్టీయు హైద్రాబాద్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరభవన్‌లో శనివారం నిర్వహించిన అన్వేషణ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఫెయిర్ ప్రోగ్రాం ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించారు. రాష్ట్రంలోని 42 ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించగా శివంపేట విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శన ఉత్తమ ప్రతిభగా నిలచింది. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మూడు బహుమతులు, మెడల్స్, ధృవపత్రాలను ఇస్రో వైస్ చైర్మన్ రఘునందన్ నాయర్ అందచేశారు. ప్రతిభచాటిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. వేదశ్రీ, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు పి.మల్లేశం, ఉపాధ్యాయులు అభినందించారు.

## చదువుతోనే బంగారు భవిష్యత్తు..
### -బాలల హక్కుల పరిరక్షణ అవగాహన సదస్సులో ఐఎన్‌హెచ్‌ఆర్‌పిసి బాధ్యులు



చిన్నారులతో నాయకులు

**నారాయణఖేడ్, జనవరి 31, ప్రభాతవార్త:**
చదువే బంగారు భవిష్యత్తని ప్రతి చిన్నారి చదువుకోవాలని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఓంప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎ ఖైసర్ అన్నారు. శనివారం వీధి బాలల దినోత్సవం సందర్భంగా నారాయణఖేడ్ పట్టణంలోని విజ్ఞాన్ టాలెంట్ స్కూల్‌లో విద్యార్థుల హక్కులపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. విద్య బాలల హక్కు అని, విద్యతోనే పిల్లల భవిష్యత్తు వెలుగులు నిండుతాయని, చదువే సమాజాన్ని సరైన దిశలో నడిపించే శక్తి అని పేర్కొన్నారు. బాలలపై ఎలాంటి వివక్ష, బాల కార్మిక వ్యవస్థ ఉండకూడదని, పిల్లలకు విద్య, ఆరోగ్యం, భద్రత వంటి హక్కులు తప్పనిసరిగా కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం గైనికాడి సురేష్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపులి సంచారం...భయాందోళనలో ప్రజలు
### -ఖండించిన అటవీశాఖ అధికారులు



సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న పెద్దపులి ఫోటో

**మెదక్ జిల్లా, జనవరి 31, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేట మండలపరిధిలోని ఎడిప్పల్ అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు వాట్సాప్ గ్రూప్‌లలో సందేశం చక్కర్లుకొడుతుంది. గత వారంరోజులుగా చిరుతపులి సంచారంతో అడవి శివారు ప్రాంతాలలోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు చిరుత పాదముద్రలను పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శనివారం ఉదయం 2 గంటల సమయంలో చిన్నశంకరంపేట మండలం ఎస్.కొండాపూర్ అడవి శివారు ప్రాంతంలో ఎడిప్పల్ వద్ద మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై పులి రోడ్డుదాటుతూ కనిపించిందని, మెదక్ లోని సూపర్ మార్కెట్‌లో పనిచేసే శేఖర్ పులి ఫోటో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టాడు. ప్రతి రోజు సూపర్ మార్కెట్‌కు వస్తువులను తన వ్యానులో తీసుకెళ్తుంటానని, ఆ సమయంలో పులిని స్వయంగా చూశానని ఆయన తెలిపారు. పులి తుర్కల మాందాపూర్ అటవీ ప్రాంతం వైపు వెళ్లినట్లు ఆయన తెలిపారు. పులి సంచారంతో కొండాపూర్, గజగట్లపల్లి, శాలిపేట, ఖాజాపూర్, ఖాజాపూర్ తండా, వెంకట్‌రావుపల్లి, శాలిపేట గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమంలో చక్కర్లుకొట్టిన పులి ఫోటోను చూసిన అటవీశాఖ బీట్ అధికారి ప్రశాంత్ మండలంలో పెద్దపులి సంచారం లేదని, చిరుతపులి మాత్రమే తిరుగుతుందని తెలిపారు. ఈ ఫోటో నాలుగు నెలల క్రితం నిర్మల్ జిల్లాలో రోడ్డు దాటుతున్న పులి చిత్రమని ఆయన తెలిపారు. ఈ విషయం పై అధికారులు విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కాగా గత వారంరోజుల నుండి గజగట్లపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తుందని అధికారులకు తెలిసినప్పటికీ చిరుతను పట్టుకోవడానికి బోను ఏర్పాటు చేయకపోవడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పులి సంచారంతో రైతులు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లాలంటే జంకుతున్నారు.

## గద్దర్‌కు ఘననివాళులు అర్పించిన చైర్మన్

**రామచంద్రాపురం, జనవరి 31, ప్రభాతవార్త:**
ప్రజాయుద్ధనౌక గద్దర్ జయంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని తెల్లాపూర్‌లోని గద్దర్‌సర్కిల్ వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. గద్దర్ గళం వ్యవస్థాపక అధ్యక్షులు కొల్లూరి సత్తయ్య, మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గద్దర్ కుమార్తె, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల, తెలంగాణ ఎంబిసి చైర్మన్ జెరిపేటి జైపాల్, డాక్టర్ జెబి రాజు, ప్రముఖ జర్నలిస్టు పాశం యాదగిరి, బిఎస్పి రాష్ట్ర కో-ఆర్డినేటర్ బాలయ్యలు ముఖ్య అతిథులుగా హాజరై గద్దర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తెల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఎల్.రవీందర్, సుధాకర్‌రెడ్డి, అరుణ్‌గౌడ్, నాయకువాడి కృష్ణ, ఐలేష్‌గారి సాయన్న, బిసి రామచందరర్, యాదయ్య, శ్యామ్‌రావు, వాజీద్, మల్లేష్‌గౌడ్, మల్లారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.



గద్దర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న డాక్టర్ వెన్నెల, నాయకులు

## ఎల్ఓసి అందజేసిన మంత్రి దామోదర రాజనర్సింహా



రూ.7లక్షల ఎల్ఓసి పత్రాన్ని అందజేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహా

**మునిపల్లి, జనవరి 31, ప్రభాతవార్త:**
పుట్టుకతో వినికిడి సమస్యతో బాధపడ్తున్న బాలికకు చికిత్స నిమిత్తం ఏడు లక్షల రూపాయలను రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి దామోదర రాజానర్సింహ మంజూరుచేశారు. మునిపల్లి మండలం అల్లాపూర్ వార్డు సభ్యులు హుస్సేన్ కుమార్తె మీజ్బా అంజూమ్ పుట్టుకతో వినికిడి సమస్యతో పాటు మాటలు రాకపోవడంతో ఆమె చికిత్సకోసం హుస్సేన్ అనేక ఆసుపత్రుల చుట్టూ తిరిగాడు. చికిత్సకోసం అయ్యే ఖర్చు తనకు శక్తికి మించినది కావడంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి దామోదర రాజానర్సింహను కలసి సమస్యను వివరించారు. మంత్రి స్పందించి ఏడు లక్షల రూపాయలను మంజూరు చేసి వెంటనే ఎల్ఓసి ఇచ్చారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
### -జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట అర్బన్, జనవరి 31, ప్రభాతవార్త:**
కామన్ డైట్ మెనూను తప్పని సరిగా పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. శనివారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి)తో పాటు సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కె.హైమావతి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం వండిన అన్నంతోపాటు గుడ్డు తదితర వంటలను పరిశీలించారు. విద్యార్థులకు డైనింగ్‌హాల్‌లో మాత్రమే భోజనం వడ్డించాలని ఇతర ప్రాంతాల్లో భోజనం వడ్డించరాదని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం చేసే సమయంలో క్రమశిక్షణతో కూడిన మంచి అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు మరల అన్నం లేదా కూరలు కోరినప్పుడు వారు కూర్చున్న చోటికే వెళ్లి వడ్డించాలని వంట సిబ్బందికి తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. వంటగది పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈగలు, దోమలు రాకుండా డెట్టాల్ వంటి శానిటైజర్లతో క్రమం తప్పకుండా శుభ్రపరచాలని తెలిపారు. విద్యాలయంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు ఎల్లప్పుడూ సక్రమంగా పని చేసేలా చూసుకోవాలన్నారు. కూరల నాణ్యతను మరింత మెరుగు పరచాలని, నిర్లక్ష్యంగా వంటచేసి విద్యార్థులకు ఆహారం అందిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. నాణ్యమైన సరుకులతో రుచికరమైన ఆహారాన్ని వండి విద్యార్థులకు అందించాలని సిబ్బందికి జిల్లా కలెక్టర్ హైమావతి సిబ్బందిని ఆదేశించారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

# అధికారులు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలి
### -జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

**సంగారెడ్డిమున్సిపాలిటీ, జనవరి31, ప్రభాతవార్త:**
ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్ణీత గడువులో వేగవంతంగా, తప్పిదాలకు తావు లేకుండా పూర్తి చేసేందుకు సూపర్వైజర్లు, బిఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసేలా అన్ని చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ మ్యాపింగ్‌లో ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా ఈఆర్‌వోలు సమగ్ర పర్యవేక్షణ చేపట్టి, ప్రక్రియను సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని తెలిపారు. బిఎల్‌వోలు, సూపర్వైజర్లకు స్పష్టమైన లక్ష్యాలు కేటాయించి, క్షేత్రస్థాయిలో ప్రక్రియ వేగంగా సాగేలా పర్యవేక్షణను మరింత పటిష్టం చేశామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, ఆర్డీఓ రాజేందర్, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### యథావిధిగా ప్రజావాణి...
**-జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ఫిబ్రవరి 2వ తేదీన యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
### -పిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్

**నారాయణఖేడ్, జనవరి 31, ప్రభాతవార్త:**
గాంధీ భవన్‌లో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జహీరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలోని అన్ని మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా మంత్రులు దామోదర్ రాజనర్సింహ, అజారుద్దీన్ లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీ గెలుపుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. సమావేశంలో ఎంపి సురేష్‌కుమార్ షెట్కార్, పార్ల మెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల శాసనసభ్యులు డా.పట్లోళ్ల సంజీవరెడ్డి, మదన్‌మోహన్‌రావు, తోట లక్ష్మీకాంతారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీమంత్రి చంద్రశేఖర్, టిజిఐఐసి చైర్‌పర్సన్ శ్రీమతి నిర్మల జగ్గారెడ్డి, సెట్విన్‌చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జిలు పాల్గొన్నారు.

## పుడమి తల్లికి హారం వృక్షసంపద



ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 31, ప్రభాతవార్త:**
తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో మదర్ ట్రీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చెట్టుకు పూజా కార్యక్రమాలు నిర్వహించి వృక్షాలను కాపాడుతామని వృక్షాల, జంతువుల మనుగడను కాపాడుతామని ప్రతిజ్ఞచేయించడం జరిగిందని ప్రిన్సిపల్ ప్రవీణ అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్, ఏకో క్లబ్ కన్వీనర్ డాక్టర్ సోఫియారాణి, ఎన్ఎస్ఎస్ అధికారులు, ఎన్సిసి అధికారి, అధ్యాపక బృందము, విద్యార్థులు పాల్గొన్నారు.

## హైకోర్టు లీగల్‌సర్వీస్ ప్యానల్ సభ్యుడిగా ఎన్నికైన తుమ్మల చంద్రశేఖర్‌రెడ్డి

**అమీన్‌పూర్, జనవరి 31, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం లీగల్ సర్వీసెస్ అత్తారింటి ప్యానెల్స్ అభ్యర్థిగా అమీన్పూర్ చెందిన ప్రముఖ న్యాయవాది తుమ్మల చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈసందర్భంగా తుమ్మల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ పటిష్టతకు తనవంతు నిరంతరం పనిచేస్తానని ఆయన అన్నారు. హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీ పానల్ సభ్యుడుగా ఎన్నికైన తుమ్మల చంద్రశేఖర్‌రెడ్డిని పలువురు కలిసి ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

## వార్డుల్లో ఊపందుకున్న ప్రచారం
### -ప్రతి వార్డులో మద్యం డంపులు

**జోగిపేట, జనవరి 31, ప్రభాతవార్త:**
మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంనాటికి ముగియటంతో ప్రధాన పార్టీల ఖరారైన అభ్యర్థుల వార్డులలో ప్రచారం జోరు పెంచారు. మొన్నటి వరకు ఎవరికి టికెట్ దక్కుతుందో తెలియని పరిస్థితుల్లో ప్రచారానికి వెళ్లాలా, వద్దా అన్న సంశయంలో కొట్టుమిట్టాడారు. అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌ల నుంచి దాదాపుగా అభ్యర్థుల జాబితా అయినప్పటికీ, కేవలం ఒకటిరెండు వార్డులలో ఇంకా సందిగ్ధపరిస్థితి నెలకొంది. అయితే వీటిని మినహాయిస్తే మిగతా వార్డులలో ప్రచారం ఊపందుకుంది. నామినేషన్ల ఉపసంహరణ దాకా వేచిచూడకుండా ప్రచారంలో దూసుకుపోతున్నారు. అయితే ప్రచారం ఒక ఎత్తయితే ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికే కొన్ని వార్డులలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రతినిత్యం భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. దీనికితోడు మద్యంకూడా పంపిణీ చేస్తున్నారు. ఇదిలా ఉంటే అన్ని వార్డులలో ప్రధాన పార్టీల అభ్యర్థులు మద్యం డంపులను ఈ పాటికే ఏర్పాటు చేసుకున్నారు. ప్రతివార్డులో మద్యం ఏరులై పారుతుంది. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఇంటింటికీ ఇరుపార్టీల అభ్యర్థులు మద్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఆడవాళ్లకు కూల్‌డ్రింక్స్, మగవారికి మద్యం పంపిణీ చేస్తున్నారు. అభ్యర్థులవెంట ప్రచారంచేసే కార్యకర్తలలో కొంత మందయితే పూర్తిగా మద్యం మత్తులోనే ఉంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వారు ఎంత మందు అడిగితే అంత మద్యాన్ని ఇవ్వకతప్పని పరిస్థితి. ఎట్టిపరిస్థితుల్లోనూ ఎవరినీ కూడా అసంతృప్తి పరచొద్దనే పరిస్థితుల్లో బరిలో ఉన్న అభ్యర్థులు అన్ని ఇబ్బందులను సహనంతో భరిస్తున్నారు. మొత్తానికి అన్ని వార్డులలో విచ్చలవిడిగా మద్యం పంపిణీ జరుగుతుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలన్న తపనతో ఎంత ఖర్చుకైనా కూడా అభ్యర్థులు వెనకాడటంలేదు.

ఒకవైపు ప్రచారం చేస్తూనే మరోవైపు వార్డుకు సంబంధించిన వ్యక్తులు ఇతర ప్రాంతాల్లో బ్రతకడానికి వెళ్లినవారి జాబితాను సిద్ధం చేసుకుని, వారికి ఫోన్లు చేయటంతోపాటు వారు వచ్చి ఓటు వేసి వెళ్లడానికి అవసరమైన రవాణాఛార్జీలను కూడా అంద చేస్తున్నారు. ముఖ్యంగా మంత్రి ఇలాకాలోని ఏకైన మున్సి పాలిటీ కావటంతో ఎట్టి పరిస్థితుల్లో చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవాలనే కసితో కాంగ్రెస్ నాయకులు పని చేస్తున్నారు. కాంగ్రెస్‌లో అభ్యర్థులు ప్రచారం చేసుకుంటూ వెళ్తుండగా, మరోవైపు కొంతమంది సీనియర్ నాయకులు ఏయే వార్డులలో పరిస్థితి ఎక్కడెక్కడ పార్టీకి వ్యతిరేకంగా ఉందనే అంశాలను పరిశీలిస్తూ, వాటిని చక్కబెట్టే పనిలో ఉన్నారు. మొత్తానికి అందోలు-జోగిపేట మున్సిపాలిటి పరిధిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రచారంలో ముందంజలో ఉండగా, బిఆర్‌ఎస్ పార్టీకి నాయకులు మాత్రం ఇరవై వార్డులలో కొన్ని వార్డులలో మాత్రమే ప్రచారంలో పరుగులు పెడుతున్నారు. ఇకపోతే బిజెపి విషయానికి వస్తే బరిలో ఉన్న అభ్యర్థుల్లో ఒక మూడో వార్డు అభ్యర్థి పులుగు గోపాల్ రావు ఆ వార్డుల్లో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిజెపిలకంటే ముందంజలో ఉన్నారు. మిగతా వార్డులలో మాత్రం బిజెపి అభ్యర్థులు ఏ ఆర్భాటం లేకుండా ఇంటింటికీ వెళ్లి పలకరించి వెళుతున్నారు.

## హత్యాయత్నం నిందితుని అరెస్ట్



పోలీసుల అదుపులో హత్యాయత్నం చేసిన ల్యాగల అబ్రహం

**కల్హేర్, జనవరి 31, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని బిబిపేట గ్రామంలో శుక్రవారం జరిగిన గొడవల్లో హత్యాయత్నం చేసిన ల్యాగల అబ్రహంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ రవిగౌడ్ కథనం ప్రకారం...గ్రామానికి చెందిన బండారి ఎసోఫ్ కుటుంబ సభ్యులతో ల్యాగల అబ్రహం కుటుంబ సభ్యులకు జరిగిన గొడవల్లో బండారి ఎసోఫ్ తలపై ల్యాగల అబ్రహం కట్టెతో దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడన్నారు. దాడిలో గాయాలకు గురైన అబ్రహం ఎసోఫ్‌ను చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్నాడు. ల్యాగల అబ్రహంపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రవిగౌడ్ వివరించారు.

### బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌కై సమ్మక్క సారమ్మలకు మొక్కులు


సమ్మక్క సారలమ్మ దేవతలకు మొక్కులు సమర్పించుకుంటున్న బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజుగౌడ్

**హైదరాబాద్, జనవరి 31 ప్రభాతవార్త**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధనకై వనదేవతులైనటువంటి సమ్మక్క సారమ్మలకు మొక్కులు చెల్లించుకున్నామని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజుగౌడ్ తెలిపారు. శనివారం మేడారం సమ్మక్క సారమ్మలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బాలరాజుగౌడ్ మాట్లాడుతూ. గిరిజనుల ఆరాధ్య దైవమైనటువంటి సమ్మక్క సారమ్మల చల్లని దీవెనలతో బహుజనులకు రాజ్యాధికారం రావాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధన ముఖ్య లక్ష్యంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆ దిశగా బహుజనలకు శక్తిని ప్రసాదించాలని అమ్మవార్లను పూజించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ ఫ్రంట కన్వీనర్‌లు యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, ఎస్.దుర్గయ్యగౌడ్, అంబాల నారాయణగౌడ్, బైరు శేఖర్ గంగపుత్ర , సింగం నాగేష్ గౌడ్, బాలగొని వెంకటేష్ గౌడ్, పోతగని ఐలేన్‌గౌడ్ పాల్గొన్నారు.

### పావురాలకు ఫీడింగ్ వద్దు ..
### గోమాతకు ఫీడింగ్ ముద్దు : బిక్షపతి యాదవ్

**నిజాంపేట్, జనవరి 31, ప్రభాతవార్త**
పావురాలకు ఫీడింగ్ వద్దు మన గోమాతకు ఫీడింగ్ ముద్దు అని బిక్షపతి యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ జంతు ప్రేమికులు పశుపక్షాదులపైన ప్రేమను చూపించాలి కానీ పావురాలకి ఫీడింగ్ చేయడం ద్వారా పావురాల రెక్కల ద్వారా అనేక వ్యాధులు ముఖ్యంగా క్యాన్సర్, శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని డాక్టర్లు ఎన్నో ఆవగాహన కార్యక్రమాలు సామాజిక మాధ్యమాల ద్వారా చెప్పున్నప్పటికీ కొంతమంది వారి ప్రవర్తన తీరులో మార్పు రావడం లేదని అన్నారు. నిజాంపేట సర్కిల్లోని గోసాల వద్ద ప్రభుత్వ ఖాళీ స్థలం ఉంది కదా అని కొంతమంది కావాలని ఈ ఫీడింగ్ కార్యక్రమం పెడుతున్నారు దానిని చూసి కొంతమంది ప్రజలు అక్కడికి వచ్చి ఫీడింగ్ కార్యక్రమం చేపట్టడం ద్వారా చుట్టు పక్కల ఉన్న ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారని తెలిపారు. కుక్కను కూడా భైరవునిగా పూజించే హిందూ ప్రజలు ప్రాచాత్య సంస్కృతిలో పడి మన హిందూ సనాతన ధర్మంలో ఉన్న గోమా తను నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రతి హిందువు కూడా కుక్కలకు బదు లుగా ప్రతి ఒక్కరు గోమాతను పూజించాలని అన్నారు. హెల్త్ డిపా ర్ట్మెంట్ కూడా పావురాలకు ఫీడింగ్ చేయొద్దని పదేపదే ఆదేశాలు జారీ చేస్తున్నారని ప్రజల ఆరోగ్య రీత్యాదీనిని నిర్మూలించాలని ఆయన కోరారు.

### పదవి విరమణ తర్వాత సమాజాభివృద్ధికి పాటుపడాలి


పదవి విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు లక్ష్మిపద్మజాకుమారిని సన్మానించిన దృశ్యం

**బేగంబజార్, జనవరి 31ప్రభాతవార్త:**
సమాజంలో గుర్తింపు పొందాలంటే విద్యతో సాధ్యమవుతుందని బహదూర్‌పురా మండల డిప్యూటి ఎడ్యుకేషన్ ఆఫీసర్ పొమ్యా నాయక్ అన్నారు. అఫ్జల్‌గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానా ఉపాధ్యాయులు లక్ష్మపద్మజాకుమారిపదవి విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరం మూలంగా జ్ఞానంతో విజ్ఞానవంతులుగా మారి సమాజాభివృద్ధి కోసం పాటుపడుతారన్నారు. తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టి.ఆర్.టి.ఎఫ్)హైదరాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎస్.విజయబాస్కర్ మాట్లాడుతూ పదవి విరమణ అనేది పెద్ద విరమణ కాదనికొత్త ఉత్సాహం పెంపొందించుకోవాలన్నారు. 35 సంవత్సరాల బాల, బాలికలకు విద్యబోధనలనుచేసి సమాజానికి ఎంతో మంది విద్యావంతులను అందించిన ప్రధానా ఉపాధ్యాయురాలు లక్ష్మిపద్మజా కుమారిని హరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షులు ఎంపి. సదానంద్, కార్యదర్శిఎం. ప్రభాకర్, మహిళా నాయకురాలు బేబిరాణి, సౌజన్య, బస్తీప్రతినిధులు పి. మహేందర్, రాములు, లక్ష్మయ్య, రామ్‌దాస్‌లతో, మహాత్మాజ్యోతిరావు పూలే యువమంచ్ అధ్యక్షులు గురుచరణ్, పూర్వఉపాధ్యాయులు హరి శంకర్, శివశంకర్, సుచరిత, బబిత, విజయ్‌లక్ష్మి, మోహిద్, బల్వంత్‌రెడ్డి, ప్రధ్యుమ్నరెడినడ, జ్యోతి, శైలజ, ముక్తధర్ తదితరులు పాల్గొన్ని పూర్వ విద్యార్దులు, ఉపాధ్యాయులు రహదారి ఇరువైపులా పూలతో స్వాగతం పలికారు. సృజన్, వైష్ణవి విద్యార్దులు పాల్గొన్నారు. విద్యార్దులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఎంతోఆకట్టుకున్నాయి.

### బల్కంపేట్ అమ్మవారి ఆలయం ప్రాంగణంలో అన్నదానం



**సంజీవరెడ్డి నగర్, జనవరి 31, ప్రభాతవార్త:**
సంజీవరెడ్డి నగర్‌లోని శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం, బల్కంపేట్ అమ్మవారి ఆలయం ఎదురు ప్రాంగణంలో ముత్యాల కృష్ణ, ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతి నెల చివరి శనివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. దాత నెల్లూరు నారాయణ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 500 మందికి అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి అమీర్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎం. హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరంగా అన్నదానం నిర్వహించడం గొప్ప సేవా కార్యక్రమమని ప్రశంసించారు. కార్యక్రమంలో నాయకులు పోతురాజు కుమార్, మహేష్ యాదవ్, మోహన్ పాల్గొన్నారు.

### నిమ్స్‌లో పలువురు పదవీ విరమణ


పదవీ విరమణ పొందిన వారిని సత్కరిస్తున్న వైద్యులు

**జూబ్లీహిల్స్, జనవరి 31, ప్రభాతవార్తః**
నిమ్స్ ఆసుపత్రిలో పలువురు ఉద్యోగులు శనివారం పదవీవిరమణ చేశారు. పాత ఓపీడీ భవనం లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆసుపత్రి డీన్ ప్రొఫెసర్ లిజా రాజశేఖర్ పదవీవిరమణ పొందిన వారిని సత్కరించి వారి సేవలను కొనియాడారు. పదవీ విరమణ పొందిన వారిలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమేష్‌కుమార్, సీనియర్ టెక్నికల్ అధికారి ఎన్. శ్రీకాంత్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేఖర్, నర్సింగ్ అధికారులు పద్మజయంతి కరణం, ఫ్లోరెన్సా హెలెనా, రికార్డ్ అసిస్టెంట్ మహమ్మద్ జమీరుద్దీన్ ఉన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి సతీష్, హెచ్‌ఆర్‌డి స్టాఫ్ ఏఎన్ జ్యోతి శైలజ, పారామెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### సాధికారత సాధించిన మహిళలే తెలంగాణ ప్రగతికి పునాది : ఎమ్మెల్యే నవీన్ యాదవ్


ఎంఐఓఆర్ఐ అకాడమీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, చిత్రంలో రమణి పెనుబాల తదితరులు

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త**
పారిశ్రామిక, వ్యాపార రంగాల్లో పోటీపడి సాధికారత సాధించిన మహిళలే తెలంగాణ ప్రగతికి పునాదిగా నిలుస్తారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ప్రముఖ సౌందర్య నిపుణురాలు రమణి పెనుబాల ఏర్పాటు చేసిన ఎంఐఓఆర్ఐ అకాడమీని ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళలకు ఉజ్వలమైన, సమాన అవకాశాలతో కూడిన భవిష్యత్తు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రభావవంతమైన విధానాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అకాడమీ నిర్వాహకురాలు రమణి పెనుబాలను అభినందించిన ఆయన, ఈ సంస్థ ద్వారా యువతులకు నాణ్యమైన వృత్తిపరమైన శిక్షణ అందించి ఉత్తమ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రమణి పెనుబాల మాట్లాడుతూ, చర్మ సంరక్షణ, మేకప్ అప్లికేషన్, హెయిర్ స్టైలింగ్, నెయిల్ కేర్, వాక్సింగ్, హెయిర్ ఫేస్ ట్రీట్మెంట్స్ వంటి విభిన్న కోర్సుల్లో అనుభవజ్ఞులైన బోధకుల పర్యవేక్షణలో ఆచరణాత్మక శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా యువతీయువకులు విజయవంతమైన కెరీర్ ప్రారంభించేందుకు మార్గదర్శనం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వృద్ధి విశ్లేషకులు వేణు కళ్యాణ్, సంఘసేవకులు భాను కిరణ్ పసుల, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధ్యారెడ్డి, టీడీపీ ప్రధాన కార్యదర్శి ఏ. విశ్వం పాల్గొన్నారు.

## 7వ తేదీ నుంచి యూరోనిక్స్ ఇసిసిఎల్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు


యూరోనిక్స్ కార్పొరేట్ క్రికెట్ లీగ్ (ఇసిసిఎల్) జెర్సీ ఆవిష్కరిస్తున్న అడేవు శ్రీనివాస్

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త**
యూరోనిక్స్ కార్పొరేట్ క్రికెట్ లీగ్ (ఇసిసిఎల్) సీజన్ 3.0 తిరిగి ప్రారంభమవుతున్నట్లు ప్రకటించింది. సంవత్సరాలుగా ఇసిసిఎల్ ఒక ప్రధాన కార్పొరేట్ క్రీడా వేదికగా రూపాంతరం చెందింది. వివిధ పరిశ్రమలకు చెందిన వ్యాపార నాయకులు, ప్రొఫెషనల్స్, జట్లు బోర్డు గదులను విడిచి క్రికెట్ మైదానంలో కలుసుకొని జట్టు సమన్వయం, నాయకత్వం, పోటీ స్ఫూర్తిని వేడుకగా జరుపుకుంటున్నారు. తొలి రెండు సీజన్ల విజయవంతమైన నిర్వహణ తర్వాత, ఇసిసిఎల్ సీజన్ 3.0 ఇప్పటివరకు జరిగిన వాటిలోనే అతిపెద్ద ఎడిషన్‌గా నిలవనుంది. ఈ టోర్నమెంట్ ఈనెల 7, 8 తేదీలలో నిర్వహించబడనుంది. మొత్తం 16 ప్రముఖ కార్పొరేట్ జట్లు పాల్గొని, 15 ఉత్కంఠభరిత మ్యాచ్‌లలో పోటీపడనున్నాయి. జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఐఎస్ బిల్డర్స్ అసోసియేషన్ తెలంగాణ చైర్మన్ అడేవు శ్రీనివాస్ హాజరై, క్రీడల ద్వారా నాయకత్వం, జట్టు బంధం ప్రాముఖ్యతపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా యూరోనిక్స్ ప్రతినిధి మాట్లాడుతూ యూరోనిక్స్‌లో మేము కేవలం ఉత్పత్తులను మాత్రమే నిర్మించము ఎకోసిస్టమ్‌లను నిర్మిస్తాము. క్రీడ అనే సార్వత్రిక భాష ద్వారా భారతదేశ కార్పొరేట్ సమాజాన్ని ఒకచోట చేర్చే మా ప్రయత్నమే నిదిదిలి. సీజన్ 3 వ్యాపారానికి అతీతంగా నాయకత్వం, ఉత్తమత మరియు దీర్ఘకాలిక సంబంధాలపై మా విస్తృత దృష్టిని ప్రతిబింబిస్తుంది" అన్నారు. భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న కార్పొరేట్ హబ్‌లలో ఒకటైన హైదరాబాద్‌లో నిర్వహించబడనున్న నిదిదిలి సీజన్ 3.0, ప్రముఖ సంస్థలు, పరిశ్రమ నిర్ణయాధికారుల పాల్గొనడంతో దేశంలోని అతిపెద్ద మరియు అత్యంత ప్రభావవంతమైన కార్పొరేట్ క్రీడా ఈవెంట్లలో ఒకటిగా నిలవనుంది.

### శాంతి భద్రతల పరిరక్షణలో సిసి కెమేరాలు కీలకం : ఎసిపి గోపాలకృష్ణ మూర్తి


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి.

**బేగంపేట జనవరి 31,ప్రభాతవార్త**
శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ తమ కాలనీలు, వ్యాపార సముదాయాలు, నివాసాలు ఇలా ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని బేగంపేట డివిజన్ ఏసీపీ గోపాల కృష్ణమూర్తి పిలుపు నిచ్చారు. నేరాల నిరోధానికి, సాక్ష్యాధారాల సేకరణకు, నేరస్థుల గుర్తింపుకు, ప్రమాదాలు జరిగిన సమయంలో వాహనాల గుర్తింపునకు, పోలీసు దర్యాప్తులో వేగం కోసం, నిరంతర నిఘా కోసం సీసీ టీవీలు ఎంతో ముఖ్యమని ఏసీపీ అన్నారు. శనివారం బేగంపేట పరిధిలోని ఇండియన్ ఎయిర్ లైన్స్ కాలనీలో సుమారు 5లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 32సీసీ కెమెరాలను కాలనీ ప్రతినిధులతో కల్సి ఏసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మనుషులు ప్రతి చోటా ప్రతినిమిషం నిఘా ఉంచడం సాధ్యం కాదని, సీసీ కెమెరాలు రాత్రి, పగలు తేడా లేకుండా నిరంతరం పనిచేస్తాయన్నారు. దీని వల్ల రద్దీ తక్కువగా ఉన్న సమయాల్లో కూడా భద్రత ఉంటుందని అన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న మిగిలిన కాలనీల వారు కూడా ఎయిర్ లైన్స్ కాలనీ వాసులను ఆదర్శంగా తీసుకుని సీసీ టీవీలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీధర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

### 15న ఎన్టీఆర్ స్టేడియంలో మహాశివరాత్రి అభిషేక ,జాగరణలు

#### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వానం


కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న చాముండేశ్వరి మహర్షి

**సైఫాబాద్, జనవరి 31 ప్రభాతవార్త:** శ్రీచాముండేశ్వరి అనుగ్రహ పీఠాధిపతులు పరమపూజ్య బ్రహ్మశ్రీ శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి శంభో, స్వయంభో మహాశివరాత్రి జప, అభిషేక జాగారణ వేడుకలు ఫిబ్రవరి 15వ తేదీన ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నామని శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి తెలిపారు. ఈ జాగారణ వేడుకలకు హాజరు కావాలని ఆయన ఈ మేరకు శనివారం నాడిక్కడ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి ఆహ్వాన ప్రతిక అందజేసి వేడుకలకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఆ రోజు దివ్య సాలగ్రామాలకు, శివలింగాలకు అభిషేకం, జపధా ్యన కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలిపారు. ప్రతి ఏడాది మహా శివరాత్రి సందర్భంగా చాముండేశ్వరి అనుగ్రహ పీఠం నిర్వహిస్తున్న జప జాగాలను అభిషేక మహోత్సవాలకు ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్దలతో సాంప్రదాయ దుస్తులతో ఈ ఉత్సవంలో పాల్గొనాలని కోరారు. దేశంలోని అన్ని రాష్ట్రాల గోసంతతిని పూజా దర్శనార్థం ప్రత్యేకమైన పూజా, గోవులను తిలకించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. వేలాది సాలగ్రామాలకు అఖండనది తీర్థాలతో అభిషేకాలు నిర్వహించే ఈ అద్భుతమైన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

### భక్తిమార్గంలో ఆండాళ్ మధురస్వప్నం-శ్రీరంగనాథ సుప్రభాతం : డా. కె.వి.రమణాచారి


శ్రీరంగనాథ సుప్రభాతం, ఆండాళ్ మధురస్వప్నంలను ఆవిష్కరిస్తున్న రమణాచారి, శ్రీదేవి, శ్రీరంగనాథ్, వెంకటరమణ తదితరులు

**రవీంద్రభారతి, జనవరి 31 ప్రభాతవార్త :** ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత్రి, గాయని టి.వి.సుందరవల్లి శ్రీదేవి ఆళ్వారుల విరచిత ఆండాళ్ మధురస్వప్నం; ప్రముఖ టిటిడి గాయకుడు పారుపల్లి శ్రీరంగనాథ్ గానం చేసిన శ్రీరంగనాథ సుప్రభాతం భక్తిమార్గంలో పయనింపజేస్తున్నాయని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. యువ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో డా. బి.ఆర్.వెంకటరమణ నిర్వహణలో రెడ్‌హిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డా. కె.వి.రమణాచారి సరస్వతి సమ్మాన్ టి.వి.సుందరవల్లి శ్రీదేవి, టిటిడి గాయకుడు పారుపల్లి శ్రీరంగనాథ్ తదితరులతో కలిసి ఆండాళ్ మధురస్వప్నం పుస్తకం, శ్రీరంగనాథ సుప్రభాతం ఆడియోలను ఆవిష్కరించి మాట్లాడారు. భక్తులందరికీ పరమ పవిత్రమైన అమ్మవారి, స్వామివారి పాదాలు ఒకసారిచూసి సేవించుకున్నాక వదిలిపెట్టడానికి ఎలాగైతే మనసురాదో 30 పాశ్వాలను నేర్చుకున్నాక మరచిపోవడం జరగదని, చిన్న వయస్సులో నేర్చుకున్న పాశ్వాలు కొన్నింటిని ఉటంకించారు. అనంతరం విశిష్ట అతిథులు డా.పులిపర్తి కృష్ణ మూర్తి, హైకోర్టు న్యాయవాది వినయకుమార్‌లు మాట్లాడారు.

### చెరువుల పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు



**అత్తాపూర్ జనవరి31,ప్రభాతవార్త :** చెరువుల పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపడుతున్నామని అత్తాపూర్ సర్కిల్ డిసి సమ్మయ్య పేర్కొన్నారు. రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు శనివారం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని చెరువులను డిసి సమ్మయ్య పరిశలించారు. హైదర్‌గూడలోని పెద్దతాళ్లకుంట చెరువు పార్కులో డిసి పర్యటిస్తూ పాదచారులతో మాట్లాడారు. పార్కులో చేసిన పారిశుధ్య పనులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. డిసి మాట్లాడుతూ..అత్తాపూర్ సర్కిల్ పరిధిలో చెరువుల పరిసరాల ను శుభ్రంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు.

### సామాజిక భవన స్థలాన్ని పరిశీలించిన కార్పొరేటర్


సామాజిక భవన స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి.

**జూబ్లీహిల్స్, జనవరి 31, ప్రభాతవార్తః**
ఖైరతాబాద్ డివిజన్‌లోని రామకృష్ణనగర్‌లో నూతనంగా నిర్మానం చేపట్టన్న సామాజిక భవన స్థలాన్ని శనివారం ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ పి. విజయారెడ్డి సందర్శించి పరిశీలించారు. గతంలో ఇక్కడ ఉన్న సామాజిక భవనం శిధిలావస్థకు చేరుకోవడంతో స్థానికుల కోరిక మేరకు కార్పొరేటర్ రూ. 11 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఈ క్రమంలోనే ఆయా ప్రాంతాన్ని శనివారం జీహెచ్‌ఎంసీ డీఈ కృష్ణచైతన్య, ఏఈ భరత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో కలిసి పరిశీలించారు. పనులను త్వరితగతిన చేపట్టి స్థానికులకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. సామాజిక భవనం ఏర్పాటు వల్ల స్థానికులు చిన్నచిన్న కార్యక్రమాలను ఇక్కడ చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని ఆమె వివరించారు. కార్యక్రమంలో స్థానిక బస్తీ నేతలతోపాటు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## నెమలీనగర్‌లోని సమస్యలు పరిష్కరించాలి : బిఆర్ఎస్


పుప్పాలగూడలోని నెమలీనగర్‌లో చెత్త సమస్యను పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నాయకుల దృశ్యం

**నార్సింగి, జనవరి 31 ప్రభాతవార్త :** మణికొండ డివిజన్ నెమలీనగర్‌లో ప్రజలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు. శనివారం నెమలీనగర్‌లో బిఆర్ఎస్ బృందం పర్యటించింది. అక్కడ ఇళ్ల మధ్యలో పేరుకుపోయిన చెత్తను, నల్లచెరువు, ఫిరంగినాలాల బఫర్‌జోన్ స్థలాలను పరిశీలించారు. పాడైపోయిన క్రీడా మైదానంలో పాడైపోయిన పరికరాలతో గాయాలపాలైన పిల్లలను పరామర్శించారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ దోమల బెడద విపరీతంగా ఉందని, దోమల నిర్మూళన కోసం మందులు పిచికారి చేయాలని, చెత్తను ఏ రోజుకు ఆ రోజు ఎత్తించాలని డిమాండ్ చేశారు. ఫిరంగినాలా, నల్లచెరువుల బఫర్ జోన్‌లను కబ్జాల చెర నుంచి విడిపించి, ప్రజలకు ఉపయోగపడేలా రోడ్డును నిర్మించాలని పేర్కొన్నారు. అధికారులు ఖాళీ ప్లాట్లకు ఇంటి నెంబర్లు కేటాయించి, ఇళ్లు నిర్మించుకున్న వారికి ఆరేళ్లుగా ఇంటి నెంబర్లు ఇవ్వకపోవడం దారుణమని మండి పడ్డారు. అధికారులు తారతమ్య భేదాలు చూపకుండా అందరికి ఇళ్ల నెంబర్లు కేటాయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు వంశీ, సత్యనారాయణ, అశోక్, విఠల్, శ్రీనివాస్, ఆంజనేయులు, బాలయ్య, నర్సిహ్మా, ఆంజనేయులు, రామ్‌సాగర్, నరేష్‌లు, బిఆర్ఎస్ నాయకులు ధన్‌రాజ్, నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, అందె లక్ష్మణ్‌రావ్, కిరణ్, ఆరిఫ్, సుమనళిని తదితరులు పాల్గొన్నారు.

## ఎపి స్పేస్ టెక్ సమ్మిట్‌లో జెహెచ్‌పిఎస్‌కు అవార్డు


పురస్కారాన్ని అందుకుంటున్న జేహెచ్‌పీఎస్ విద్యార్థులు.

**జూబ్లీహిల్స్, జనవరి 31, ప్రభాతవార్తః**
ఏపీ స్పేస్‌టెక్ సమ్మిట్‌లో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ (జేహెచ్‌పీఎస్) తన ఘనతను చాటింది. ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో జరిగిన ఈ సమ్మిట్‌లో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు మూడు ప్రాజెక్టులను ప్రదర్శించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ కాంచనవల్లి తెలిపారు. డైసన్ స్వార్మ, సౌరశక్తిని మొహరించడంపై దృష్టి సారించడంతోపాటు భారీ స్థాయిలో పునరుత్పాదక శక్తిని ఉత్పత్తి చేయడానికి, సూర్యుడి చుట్టూ ఉపగ్రహాలను సేకరించే నమూనాలను ప్రదర్శించారు. కాస్మిక్ ఈవెంట్‌ను అధ్యయనం చేయడానికి ఉపయోగించే లేజర్ ఇంటర్‌ఫెరోమీటర్ గ్రావిటేషనల్-వేవ్ అబ్జర్వేటరీ పనితీరును, ప్రాముఖ్యతను 'ది లిగో' నమూనా ద్వారా వివరించారు. ది అరిస్టోక్రాట్ ప్రాజెక్ట్ నమూనా మార్స్ మిషన్ భావనను ప్రదర్శించేలా ఏర్పాటుచేశారు. ఇది రాకెట్ ప్రయోగంతో ప్రారంభమై, ఆర్బిటర్, ల్యాండర్‌ను కలిగి ఉన్నట్లు వివరించారు. 120 జట్లు, 43 పాఠశాలలు పాల్గొన్న ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన కార్తిక్ మోతుకూరి, శివంక్ కార్తిక్ భూపాల్, ప్రద్యుమ్న మంచికంటి రూపొందించిన ది అరిస్టోక్రాట్ ప్రాజెక్ట్ మూడో స్థానాన్ని దక్కించుకున్నట్లు కాంచనవల్లి వివరించారు. ఈ నమూనాకు రూ. 7500ల నగదు బహుమానాన్ని నిర్వాహకులు అందిచారన్నారు.

**త్యాగరాజు ఉత్సవాలు..**
త్యాగరాజు జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని పాఠశాలలో ఆయా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. త్యాగరాజు కృతులతో విద్యార్థుల ప్రదర్శన ఇక్కడ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు మురళీముకుంద్ మాట్లాడుతూ.. శాస్త్రీయ సంగీతం వారసత్వాన్ని సజీవంగా ఉంచడానికి విద్యార్థులు చేసిన ప్రయత్నాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు త్యాగరాజు కృతులు, చిత్రపటంతో కీర్తనలు ఆలపిస్తూ పాఠశాల చుట్టుపక్కల పర్యటించారు.

### కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన


ఎం.జె.మార్కెట్ చౌరస్తా వద్ద నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**అఫ్జల్‌గంజ్, జనవరి 31ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకానికి వ్యతిరేకంగా ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎం.జె మార్కెట్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు పాల్గొన్ని నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఖైరతాబాద్ కాంగ్రెస్ డి.సి.సి అధ్యక్షులు మోత రోహిత్ ముదిరాజ్ అధ్యక్షతన సత్యాగ్రహం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పనికి ఆహారం పేరు మార్పు చేయడం పట్ల తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీత, మాజీకార్పొరేటర్ మమతసంతోష్‌గుప్త, పరమేశ్వరి, కాంగ్రెస్ నాయకులు ముంద్రాయి శ్రీనివాస్, నరేందర్ శెట్టి, యోగిచంద్రమోహన్‌యాదవ్, శ్రీకాంత్‌యాదవ్, బద్దం సతీష్‌గౌడ్, అశోక్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న విపి.గౌతమ్ ఐఎఎస్

**దుండిగల్, జనవరి 31 ప్రభాతవార్త:** గండిమైసమ్మదుండిగల్ మండలం పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయాలను శనివారం తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి విపి. గౌతమ్ ఐఎఎస్ సందర్శించారు. గాగిల్లాపూర్, భౌరంపేటలలో కొనసాగుతున్న నిర్మాణాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాల్లో జాప్యం, నాణ్యత లోపాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని త్వరితంగా నిర్మాణాలను పూర్తి చేయాలని గుత్తేదారులను, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నివేదికలు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డి.పోచంపల్లి, దుండిగల్, బహదూర్‌పల్లి పరిధిలలోని సముదాయాల్లో ఇండ్ల కేటాయింపులు జరగడంతో లబ్దిదారులు నివాసం ఉంటున్నట్లు అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. స్పందించిన ఆయన నివాసిత సముదాయాల్లో మౌళిక వసతులు కల్పించాలని, లబ్దిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి అధికారులు సమన్వయంతో ఉంటూ త్వరితంగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.రాజేశ్వర్‌రెడ్డి, డిప్యూటి కమీషనర్ వెంకటేశ్వర్‌నాయక్, హౌసింగ్‌బోర్డు అధికారులు పాల్గొన్నారు.

### విద్యార్థుల ప్రదర్శనకు నిదర్శనంగా నాలెడ్జ్ కార్నివాల్


కార్నివాల్ లో తాము తయారు చేసిన వాటి గురించి వివరిస్తున్న విద్యార్థులు.

**బేగంపేట జనవరి 31,ప్రభాతవార్త** విద్యార్థుల ప్రదర్శనకు నిదర్శనంగా నాలెడ్జి కార్నివాల్ నిలుస్తుందని, కొత్త ఎల్లయ్య హైస్కూలు కరస్పాండెంట్ కొత్త శంతన్ కుమార్ అన్నారు. సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని కొత్త ఎల్లయ్య హైస్కూల్లో విద్యార్థులు రెండు రోజుల పాటు నిర్వహించే నాలెడ్జ్ కార్నివాల్ శనివారం ప్రారంభమైంది. కార్నివాల్లో గణిత, సామాన్య, సాంఘికశాస్త్రాలకు సంబంధించిన పాఠ్యాంశాలను అందరినీ ఆకట్టుకునే విధంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో ఎల్ కే జీ నుంచి 9వతరగతి వరకు విద్యార్థులు పాల్గొన్నారు.

**అగ్ని ప్రమాదానికి గురైనా ఆగని కార్నివాల్.....**
కొత్త ఎల్లయ్య మెమోరియల్ హైస్కూల్లో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మహంకాళీ పోలీసుస్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ తో ఒక గదిలో మంటలు అంటుకుని ఆ గదిలో ఉన్న వస్తువులు కాలిపోయాయి. వెంటనే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది సకాలంలో అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే నాలెడ్జ్ కార్నివాల్ కోసం విద్యార్థులు తయారు చేసిన నమూనాలు కొన్ని కాలిపోయాయి. అయినా కార్నివాల్ నిలిపివేయకుండా కొనసాగించారు.

### మసీదుల వద్ద పారిశుధ్య పనులు చేయించాలని డిసికి వినతి


పర్వదినాల సందర్భంగా మసీదుల వద్ద పారిశుధ్య పనులు చేయించాలని రాజేంద్రనగర్ డిసి సురేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

**నార్సింగి, జనవరి 31 ప్రభాతవార్త :** ముస్లీంల పర్వదినాల సందర్భంగా మసీదుల వద్ద పారిశుధ్య పనులు చేయించాలని కోరుతూ రాజేంద్రనగర్ డిసి సురేందర్‌రెడ్డికి పిఅండ్‌టీ కాలనీ ప్రతినిధులు నదీం, షఫీద్దీన్, హఫీజ్‌ఖాన్, ఖుతుబుద్దీన్‌లు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండ్లగూడ డివిజన్ పరిధిలోని పిఅండ్‌టీ కాలనీలో త్వరలో వచ్చే షబ్ ఇ బరాత్, రంజాన్ పండగల కోసం పారిశుద్య పనులు, వీధి లైట్ల మరమ్మత్తులు, ఫోకస్‌లైట్ల ఏర్పాటు, దోమల ఫాగింగ్, ప్రత్యేక స్వీపింగ్ డ్రైవ్‌లు చేయాలని డిసిని కోరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆదేశాల మేరకు డిసిని కలిశామని, డిసి సానుకూలంగా స్పందించారని వివరిం చారు. పర్వదినాలను భక్తి,శ్రద్దలతో ఘనంగా జరుపుకునేందుకు సహకరించాలని అధికారులను కోరినట్లు తెలిపారు. అధికారుల స్పందన పట్ల మైనార్టీ నాయకులు సంతోషంను వ్యక్తం చేశారు.

### మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి : స్వరూప గౌడ్


మహిళలతో సమావేశమైన మాజీ కార్పొరేటర్ స్వరూపాగౌడ్

**సికింద్రాబాద్, జనవరి 31 ప్రభాతవార్త:**
మహిళలు రాజకీయంగానే కాకుండా అన్ని రంగాల్లో ముందుండాలని, కొత్త మహిళా పొదుపు గ్రూపుల సంఖ్యను మరింతగా పెంచాలని మాజీ కార్పొరేటర్ స్వరూపాగౌడ్ తెలిపారు. ఇందువల్ల ప్రభుత్వం నుండి స్వయం ఉపాధి పొందవచ్చుని చెప్పారు. బౌద్ధనగర్ డివిజన్ లోని అశోక్ నగర్, సంజీవపురం, అంబర్ నగర్, ఎల్, నారాయణ నగర్, బౌద్ధ నగర్ బస్తీల మహిళలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆదివారం జరగబోయే కేలో సంసద్ క్రీడా పోటీలలో భాగంగా (మ్యూజికల్ చైర్) మహిళలకు మాత్రమే అవకాశం ఉంటుందని చెప్పారు. పైన తెలిపిన ప్రాంతాలలో ఏర్పాటు చేయడం జరుగుతుందని, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆటల పోటీలలో పాల్గొనాలని స్వరూప గౌడ్ కోరారు. కార్యక్రమంలో సరిత, సుశీల, రమ, రాజమణి, పల్లవి, భారతి, పద్మ, పుష్ప, భాను. నీరజ, సంధ్య, కావ్య, రవి ప్రసాద్ గౌడ్, శ్రావణ్, రూప్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు సైన్సు ప్రదర్శనలు దోహదం


కార్యక్రమంలో పాల్గొన్న డాన్ విద్యా సంస్థల చైర్మన్ ఫజల్ ఉల్ రెహ్మాన్

**చార్మినార్, జనవరి 31 ప్రభాతవార్త :**
విద్యార్దులలో దాగియున్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలు ఎంతగానో దోహద పడతాయని డాన్ విద్యా సంస్థల చైర్మన్ ఫజల్ ఉర్ రెహ్మాన్ అన్నారు. పాతబస్తీ పురానీహవేలిలోని డాన్ హైస్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సైన్సు ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్దులకు విజ్ఞాన ప్రదర్శనలు చేసేందుకు అన్ని విధాల ప్రోత్సహించవలసిన బాధ్యత ప్రతీ విద్యా సంస్థపై ఉందని ఆయన తెలియజేశారు విద్యార్దులకు ప్రాదమిక దశలో గణితంతో పాటు సైన్సు విషయాలపై పూర్తి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డాన్ విద్యా సంస్థల డైరెక్టర్ ఫైసల్ రెహ్మాన్, సైంటిఫిక్ అకాడమీ, తావూస్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

నర్సాపూర్, జనవరి 31, ప్రభాతవార్త:

నర్సాపూర్‌పట్టణంలోని బస్టాండ్ హనుమాన్ ఆలయంలో శనిత్రయోదశిని పురస్కరించుకొని శ్రీప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలు ఆలయ పూజారి హరిప్రసాద్ శర్మ నేతృత్వంలో పూజలు నియమనిష్టలతో భక్తిశ్రద్ధలతో కర్పూర హారతి సమర్పించి శ్రీప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులతో భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజాకార్యక్రమాలకు భారీసంఖ్యలో భక్తులు హాజరై ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయపూజారి హరిప్రసాద్‌శర్మతోపాటు సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం...

పాపన్నపేట, జనవరి 31, ప్రభాతవార్త:

ఏడుపాయల జాతర కోసం కరెంట్ తీగల క్రింద ఉన్న చెట్ల కొమ్మలు నరికి వేత కార్యక్రమం ఉన్నందున ఆదివారం పొడిచన్‌పల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఇ నర్సింలు తెలిపారు. కొత్తపల్లి, గాంధారిపల్లి, పొడిచన్‌పల్లి, నాగ్సాన్‌పల్లి గ్రామాల్లో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు.

## ఫర్టిలైజర్ యాప్ ద్వారా యూరియా కొనుగోలు..



రైతులకు యూరియా బస్తాలను అందజేస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట, జనవరి 31, ప్రభాతవార్త:

ఫర్టిలైజర్ ఆప్ ద్వారా యూరియా కొనుగోలు ప్రారంభమైందని వ్యవసాయ అధికారి నాగం కృష్ణ తెలిపారు. శనివారం యాప్ దారా బుకింగ్ చేసుకున్న రైతులకు యూరియా బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి నాగం కృష్ణ మాట్లాడుతూ రైతులు తమ మొబైల్ లో ప్లే స్టోర్ నుండి ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ను డౌన్లోడ్ చేసుకొని తమ మొబైల్ నెంబర్‌ని టైప్ చేయాలని, పట్టాపాస్ బుక్కుకు లింకు ఉన్న మొబైల్ నెంబరుకు ఓటిపి వస్తుందని దానిని ఎంట్రీ చేసి సబ్మిట్ చేయాలనీ, రైతు పట్టా పాస్ బుక్ నంబర్ను సెలెక్షన్ చేసుకొని సబ్మిట్ చేసినచో రైతుకు ఉన్న ఎకరాలు మొత్తం సూచించబడుతుందని అన్నారు. తద్వారా తమకు ఎన్ని యూరియా సంచులుఅవసరం ఉందో ఆప్ లో సూచించబడుతుందనీ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు వినీత్, అఖిల్, సుభాష్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

గజ్వేల్ టౌన్, జనవరి 31, ప్రభాతవార్త:

గజ్వేల్ పట్టణంలోని శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలను గౌడసంఘం ఆధ్వర్యంలో శనివారం అత్యంతవైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మతల్లి ఆలయ సముదాయంలో మహిళలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. అమ్మవారికి అభిషేకం, హోమం, కుంకుమార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులకు గౌడ సంఘం ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలతోపాటు అన్నప్రసాదం అందజేశారు.

**అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి...**

శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి వార్షికోత్సవ వేడుకల్లో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డిలు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మొనగారి రాజు, ప్రేమ్‌కుమార్, గాజుల చంద్రమౌళి, పంజాల రాజుగౌడ్, క్యాసారం కొండల్‌రెడ్డి, నర్సింగరావు, గౌడ సంఘం కమిటీ సభ్యులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపిడివో వేణుగోపాల్‌రెడ్డి

జగదేవ్‌పూర్, జనవరి 31, ప్రభాతవార్త:

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని, క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి దోహదం చేస్తాయని జగదేవ్‌పూర్ ఎంపిడివో పి.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సిఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ నిర్మళ, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఎంఈవో సైదులు, ఎస్ఐ కృష్ణారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఎలియాస్‌రావులు జ్యోతి ప్రజ్వలన చేసి క్రిడలను ప్రారంభించారు. ఈ క్రీడా పోటీల్లో కబడ్డీ బాలుర విభాగం ప్రథమ స్థానంలో జగదేవ్‌పూర్, ద్వితీయ స్థానంలో ఇటిక్యాల, బాలికల విభాగంలో ప్రథమ జగదేవ్‌పూర్, ద్వితీయ ఇటిక్యాల, వాలీబాల్ బాలుర విభాగంలో ప్రథమ తీగుల్, ద్వితీయ జగదేవ్‌పూర్, బాలికల విభాగంలో ప్రథమ జగదేవ్‌పూర్, ద్వితీయ మునిగడప, ఖోఖో బాలుర విభాగంలో ప్రథమ తీగుల్, ద్వితీయ ఇటిక్యాల, బాలికల విభాగంలో ప్రథమ తీగుల్, ద్వితీయ ఇటిక్యాల జట్లు గెలుపొందగా వారికి జగదేవ్‌పూర్‌సర్పంచ్ పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్, ఎంఈవో సైదులుతో కలిసి ఎంపిడివో వేణుగోపాల్‌రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఖాజా మొయినొద్దీన్, ఉపాధ్యాయులు నేతి శంకర్, మధు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు విద్యాధర్, నాయకులు హేమ సురేష్, పంచాయతీ కార్యదర్శులు రాంరెడ్డి, సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాయుద్ధ నౌక గద్దర్ జయంతి



నివాళి అర్పిస్తున్న సిపిఐ నాయకులు

నారాయణఖేడ్, జనవరి 31, ప్రభాతవార్త:

నారాయణఖేడ్ అంబేద్కర్ భవన్‌లో ప్రజా యుద్ధనౌక, తెలంగాణ పోరాటయోధుడు గద్దర్ (గుమ్మడి విఠల్‌రావు) జయంతిని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద్ సిపిఐపార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గద్దర్ జయంతి సందర్భంగా సిపిఐపార్టీ చిరంజీవి మాట్లాడుతూ అణచివేతకు వ్యతిరేకంగా తన ఆటపాటల ద్వారా ప్రజలను చైతన్యపరిచిన పోరాటవీరుడు గద్దర్ అని ఆయన స్మరించుకున్నారు. సమాజంలో అసమానతలు, వివక్షలకు వ్యతిరేకంగా పోరాడిన గొంతుక గద్దర్ అని కొనియాడారు. గద్దర్ జయంతిని ఆయన పేరుతో అవార్డును నెలకొల్పి ప్రతి ఏటా కవులు, కళాకారులు, సినీ ప్రముఖులకు ప్రదానం చేయాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తుచేశారు. గద్దర్ పాటలు, ఆలోచనలు, పోరాటస్ఫూర్తి ప్రజల మధ్య శాశ్వతంగా జీవిస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఆమహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు చిరంజీవి అశోక్ ప్రేమ్ రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్ల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

**-పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి**

అమీన్‌పూర్, జనవరి 31, ప్రభాతవార్త:

అమీన్పూర్ సర్కిల్ పరిధిలో నూతనంగా ఏర్పడిన అమీన్పూర్, బీరంగూడ డివిజన్ల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.

బీరంగూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన కాలనీ ముఖ ద్వారాన్ని ప్రారంభించిన శనివారం ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తూ నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు కాలనీ ముఖద్వారం నిర్మించేందుకు సంపూర్ణ సహకారం అందించిన దాసుయాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహాగౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కాలనీ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న గూడెం మహిపాల్‌రెడ్డి దృశ్యం

## వైభవంగా శని త్రయోదశి మహోత్సవం



శని త్రయోదశి పూజల్లో పాల్గొన్న భక్తులు

వర్గల్, జనవరి 31, ప్రభాతవార్త:

తెలంగాణ జిల్లాల్లో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో శనివారం శనిత్రయోదశి మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు 35వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ సంబరాల సందర్భంగా ఆలయ సముదాయాన్ని నిర్వాహకులు సర్వాంగసుందరంగా తీర్చిదిద్దగా, ఈ మహోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు.

## కేతకి ఉత్సవాలు సమన్వయంతో నిర్వహించాలి

**-సమావేశంలో డిఎస్‌పి సైదానాయక్**



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి సైదా నాయక్

ఝరాసంగం, జనవరి 31, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన ఝరాసంగంలోని శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి పర్వదినాలను పురస్కరించుకుని నిర్వహించే జాతర ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని డిఎస్‌పి సైదానాయక్ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డిఓ దేవుజా, డిఎస్‌పి సైదా నాయక్‌ల ఆధ్వర్యంలో కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ సిఐ జక్కుల హనుమంతు, తహసీల్దార్ భాస్కర్, ఎంపిడిఓ మంజుల, వైద్యాధికారి రమ్య, కార్యనిర్వాహణ అధికారి శివ రుద్రప్ప, ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్, అధికారులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెకు మద్దతు తెలుపుతున్నాం




డిఆర్‌డిఎ కార్యాలయంలో సమ్మె నోటీసును ఇస్తున్న ఐకెపి నాయకులు

కొండపాక, జనవరి 31, ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, కార్మిక, ప్రజ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా చేపట్టె సమ్మెలో పాల్గొంటామని శనివారం కార్మికులు ఆయాశాఖల అధికారులకు సిఐటియు జిల్లా నాయకుడు అమ్ముల బాల్‌నర్సయ్య అధ్వర్యంలో సమ్మె నోటీసులు అందించారు. మధ్యాహ్నభోజన కార్మికసంఘం నాయకులు డిఈఓ కార్యాలయం సూపరింటెండెంట్‌కు, ఐకెపి విఓఎ లీడర్ల సంఘం నాయకులు డిఆర్‌డిఎ కార్యాలయంలో, గ్రామ పంచాయతి వర్కర్స్ యూనియన్ నాయకులు డిఎల్‌పిఓకు వినతి పత్రం అందించారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం

**-బెజుగామలో విద్యుత్‌శాఖ ప్రజాబాట**

**-విద్యుత్ శాఖ ఎడిఈ జగదీష్**

గజ్వేల్ టౌన్, జనవరి 31, ప్రభాతవార్త:

విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యమని విద్యుత్ శాఖ ఎడిఈ జగదీష్, ఏఈ మారుతిలు తెలిపారు. శనివారం గజ్వేల్ మండలం బెజుగామ గ్రామంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ప్రజాబాట(గ్రామసభ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎడిఈ, ఏఈలు మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులు, గ్రామస్తులు విద్యుత్ వాడకంలో తగు జాగ్రత్తలు పాటించాలని, స్టార్టర్లు మరియు విద్యుత్ తీగలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ బిల్లుల చెల్లింపు, కొత్త కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామస్తులు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కిర్త గోపాల్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, లైన్‌మెన్, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తా

**-బిఆర్‌ఎస్ కౌన్సిలర్ అభ్యర్థిని అనసూయ అశోక్‌గౌడ్**

నర్సాపూర్, జనవరి 31, ప్రభాతవార్త:

నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 13వవార్డులో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించి అభివృద్ధి చేస్తామని 13వ వార్డు టిఆర్‌ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి దుర్గాప్పగారి అనసూయ అశోక్‌గౌడ్ అన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని 13వ వార్డ్ బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి దుర్గాప్పగారి అనసూయ అశోక్‌గౌడ్ ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డు తో పాటు తెలంగాణలో 10 సంవత్సరాల అభివృద్ధి పనులను పథకాలను ఇంటింటికి పర్యటించి తెలియజేశారు. ప్రజలందరూ ఆశీర్వదించి తనను కౌన్సిలర్‌గా గెలిపించాలని వార్డుకౌన్సిలర్ అభ్యర్థి అనసూయ అశోక్‌గౌడ్ కోరారు. అంతకు ముందు 13వవార్డుకు చెందిన పెద్దలు, మహిళలు, నాయకులు కార్యకర్తలు అనసూయ అశోక్‌గౌడ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకురావాలి

**-ఎంపిడివో లక్ష్మప్ప**



మాట్లాడుతున్న ఎంపిడివో లక్ష్మప్ప

కొమురవెల్లి, జనవరి 31, ప్రభాతవార్త:

మండలంలోని రసులబాద్ గ్రామంలో సర్పంచ్ పచిమడ్ల అనుషస్వామిగౌడ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఎంపీడీవో లక్ష్మప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా సర్పంచ్, కార్యదర్శులకు తెలియజేయాలన్నారు. గ్రామ అభివృద్ధికోసం తాము ప్రతినిత్యం వహించి గ్రామపంచాయతీకి తోడుంటామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్రోళ్ల దర్శనం సుదర్శన్, పంచాయతి కార్యదర్శి బాల నరసయ్య, ఏఎస్ఐ సత్యనారాయణ రెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

## ఉద్యోగ జీవితంలో పదవీవిరమణ సహజం

**-జిల్లా అదనపు ఎస్పీ మహేందర్**




కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ తదితరులు

వెల్దుర్తి, జనవరి 31, ప్రభాతవార్త:

ప్రభుత్వ ఉద్యోగులకు జీవితంలో పదవీవిరమణ సహజమేనని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించిన హెడ్ కానిస్టేబుల్ రామచంద్రారెడ్డి పదవీవిరమణ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు ఎస్పి మహేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రామ్‌చంద్రరెడ్డి కానిస్టేబుల్‌గా జిల్లా పోలీస్ శాఖలు నియమితులై ఎన్నో సంవత్సరాలుగా వివిధ పోలీస్ స్టేషన్లో సాధారణ విధులతో పాటు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో కూడా అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వహించారని ఆయన తెలిపారు. పోలీస్‌శాఖలో ఆయన చేసిన సేవలే గుర్తుండిపోతాయని అన్నారు. కార్యక్రమంలో సిసిఎస్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి. ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి. డిసిఆర్‌సి ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి. డిపిఓ సిబ్బంది. రామచంద్ర రెడ్డి కుటుంబ సభ్యులు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మరొకసారి అవకాశం ఇస్తే రెండవ వార్డును అభివృద్ధితో తీర్చిదిద్దుతా

**-రెండవవార్డ్ బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి లతారమేష్‌యాదవ్**

నర్సాపూర్, జనవరి 31, ప్రభాతవార్త:

నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల జరుగుతున్న నేపథ్యంల్లో రెండవ వార్డ్ నుంచి మరొకసారి కౌన్సిలర్‌గా అవకాశమిస్తే రెండవ వార్డును అభివృద్ధి పథంలో తీర్చిదిద్దుతానని నర్సాపూర్ మున్సిపల్ రెండవ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి ఎర్ర గొల్ల లతా రమేష్ యాదవ్ అన్నారు. శనివారం నర్సాపూర్ లోని రెండవ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లతా రమేష్ యాదవ్ మాట్లాడుతూ గత నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో తనను రెండవ వార్డ్ కౌన్సిలర్ గా అవకాశం ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపించారని అన్నారు. దీంతో ప్రభుత్వం నుండి వచ్చే నిధులతో కాకుండా తను సొంత నిధులతో అభివృద్ధి చేశానని తెలిపారు. కౌన్సిలర్ గా తాను చేసిన అభివృద్ధి వార్డు ప్రజలకు తెలుసునని అన్నారు. ఈ మేరకు ప్రస్తుతం జరుగుతున్న నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్ కలిసి రాగా రెండవసారి రెండవ వార్డుకు కౌన్సిలర్ గా పోటీ చేస్తున్నానని తెలిపారు. ఈ మేరకు వార్డు ప్రజలు ఆశీర్వదించి రెండవసారి కౌన్సిలర్గా గెలిపించినట్లయితే వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో తీర్చిదిద్దుతానని రెండవ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి లత రమేష్ యాదవ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెండవ వార్డ్ ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఖో-ఖో క్రీడల్లో నెక్సస్ టెక్నోస్కూల్ విద్యార్థుల ప్రతిభ




ప్రతిభచూపిన క్రీడాకారులు దృశ్యం

నారాయణఖేడ్, జనవరి 31 ప్రభాతవార్త:

నారాయణఖేడ్ మండల పరిధిలోని తహసీల్దార్ మైదానంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడాపోటీల్లో నెక్సస్ టెక్నో స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. కొక్కో విభాగంలో పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానం, విద్యార్థులు ద్వితీయస్థానం సాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నరేష్‌కుమార్‌చారి మాట్లాడుతూ, మండలస్థాయిలో విద్యార్థులు ఇలాంటి ప్రతిభను కనబరచడం గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, ఐక్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ కిషన్, ప్రిన్సిపాల్ నిర్మల, పీఈటీ వంశీ, గీత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బుకింగ్ యాప్ ద్వారానే యూరియా అమ్మకాలు

**-మండల వ్యవసాయ అధికారి దీపిక**

నర్సాపూర్, జనవరి 31, ప్రభాతవార్త:

మండలంలోని ఫర్టిలైజర్ డీలర్‌లు యూరియాను బుకింగ్ యాప్ ద్వారానే రైతులకు అమ్మకాలు జరపాలని మండల వ్యవసాయ అధికారి దీపిక ఆదేశించారు. శనివారం మండలంలోని ఎరువుల దుకాణాలలో రైతులకు డీలర్లకు యూరియాబుకింగ్ యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు దుర్గాప్రసాద్ రుతు మోహన్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో సైతం రాణించాలి

అల్లాదుర్గం, జనవరి 31, ప్రభాతవార్త:

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సైతం రాణించాల్సిన అవసరం ఉందని కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ తుకారం అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం కళాశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, క్యారంలతో పాటు పలు క్రీడలను నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్యామ్‌రావు, రవికుమార్, రవీందర్, శివ కుమార్, నరసింహారెడ్డి, శంకర్, స్రవంతి, దత్తు, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాబాటలో విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

**-విద్యుత్‌శాఖ ఏడిఈ వెంకటరమణారెడ్డి**

నర్సాపూర్, జనవరి 31, ప్రభాతవార్త:

ప్రజాబాట కార్యక్రమంలో గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని నర్సాపూర్ విద్యుత్‌శాఖ ఏడిఈ వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం నర్సాపూర్ మండలపరిధిలోని అచ్చంపేటగ్రామంలో గ్రామ సర్పంచ్ నీరుడి తుల్చమ్మ బిక్షపతి ఆధ్వర్యంలో ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రజాబాట కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్ అధికారులు గ్రామంలోని ప్రతివార్డులో పర్యటించి విద్యుత్ సమస్యలను పరిశీలించారు. అంతేగాక ఏ విద్యుత్ సమస్యలు ఉన్నాయో గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ఎల్‌టి లైన్ తొలగించాలని కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయాలని సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు కోరారు. ఈమేరకు ఎల్టిలైన్లు తొలగిస్తానని విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తానని ఏడిఏ వెంకటరమణారెడ్డి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ రామ్మూర్తి, లైన్ ఇన్స్పెక్టర్ ఉస్మాన్, ఉప సర్పంచ్ నవీన్, వార్డు సభ్యులు ఆంజనేయులు, కృష్ణ, ప్రవీణ్, లైన్మెన్ రాజ్ కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

## క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందజేత



క్రీడాకారులకు పదివేల రూపాయలను అందజేస్తున్న సర్పంచులు

చౌటకూర్, జనవరి 31, ప్రభాతవార్త:

చౌటకూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సిఎం కప్ క్రీడోత్సవాలలో భాగంగా బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో వేజేతలకు సరాఫ్‌పల్లి, ఉప్పరిగూడెం సర్పంచులు క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందజేశారు. తమకు దాతలు ఆర్థికసహాయం అందించి ఆదుకోవాలని క్రీడాకారులు కోరారు. దీనితో మండల పరిధిలోని సరాఫ్ పల్లి సర్పంచ్ రామచంద్రరెడ్డి, ఉప్పరిగూడెం సర్పంచ్ గొల్లమల్లేశంలు క్రీడాకారులకు ప్రోత్సాహం కోసం పదివేల రూపాయలను అందజేశారు. క్రీడాకారులకు అందజేయడం పట్ల పలువురు వారిని అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు రామాగౌడ్, గ్రామ అధ్యక్షులు వర్కల రమేష్, ప్రధానోపాధ్యాయులు అనురాధ, బొమ్మారెడ్డిగూడెం సర్పంచ్ జైపాల్‌నాయక్, చౌట్కూర్ ఉపసర్పంచ్ నాగరాణికృష్ణ, మోహన్‌రెడ్డి, రాజు, వార్డ్ మెంబర్లు చక్రపాణి, దప్పు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

**-సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి**

జహీరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:

కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా ఫిబ్రవరి12న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెను జయప్రదంచేయాలని సిఐటియు రాష్ట్రకార్యదర్శి కాసు మాధవి అన్నారు. శనివారం పట్టణంలోని శ్రామిక్‌భవన్‌లో సిఐటియు ఏరియా విస్తృతస్థాయి సమావేశానికి మాధవి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్, వివిధరంగాల యూనియన్ల నాయకులు దశరథ్, నరేష్, నందమ్మ, గౌరమ్మ, శశికళ, ఆనంద్, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

**-జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు కార్పొరేటర్ సింధూ వినతి**



జిహెచ్‌ఎంసి కమిషనరర్‌కు వినతిపత్రం అందచేస్తున్న కార్పొరేటర్

రామచంద్రాపురం, జనవరి 31, ప్రభాతవార్త:

భారతీనగర్ డివిజన్‌లో అభివృద్ది పనులు చేపట్టేందుకు నిధులు మంజూరుచేయాలని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శరెడ్డి జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలుసుకుని వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ సింధూ ఆదర్శరెడ్డి మాట్లాడుతూ నిత్యం వందలాది మంది ప్రయాణించే ఎంఎంటిఎస్ హాల్ట్ నుంచి ఎంఐసి సొసైటీ మీదుగా విద్యుత్ నగర్ బస్టాప్ వరకు బిటి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. అమీన్‌పూర్‌లో ఉన్న జిహెచ్‌ఎంసి సర్కిల్ కార్యాలయాన్ని రామచంద్రాపురంకు మార్పు చేయాలని, లేదా పేరు మార్పు చేయాలన్నారు. తను అందచేసిన వినతి పత్రానికి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ సానుకూలంగా స్పందించారని, అమీన్‌పూర్ సర్కిల్ మార్పుకు ప్రభుత్వానికి కమిషనర్ ప్రతిపాదనలు పంపించినట్లు కార్పోరేటర్ సింధు ఆదర్శరెడ్డి వివరించారు.

## శంశల్లాపూర్‌లో పాత పంటల జాతర

న్యాల్‌కల్, జనవరి 31, ప్రభాతవార్త:

జహీరాబాద్ డిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 26వ పాత పంటల జాతర శనివారం మండల పరిధిలోని శంశల్లాపూర్ గ్రామంలో నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న పాత పంటల జాతరను (అందంగా పాత పంటల విత్తనాలతో అలంకరించిన ఎడ్ల బండ్లను) గ్రామ రైతులు ఘనంగా స్వాగతం పలికారు. డిడిఎస్ మహిళలు కోలాటం ఆడుతూ జానపద గేయాలు ఆలపిస్తూ జాతరకు స్వాగతం పలికారు. పాత పంటలతో కలిగే ప్రయోజనాలపై రైతులకు వివరించారు.

## సంస్కృతీసంప్రదాయాలను కాపాడాలి

**-మాజీ ఎంపిపి జంగం శ్రీనివాస్**

పెద్దశంకరంపేట, జనవరి 31, ప్రభాతవార్త:

భారతీయ సంస్కృతీసంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. శనివారం సంస్కార్ విద్యాలయంలో నిర్వహించిన సంప్రదాయ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. సంస్కృతీసంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో రాజాశేఖర్‌రెడ్డి. రాజేందర్‌గౌడ్. శ్రావణ్‌కుమార్. రాజన్‌గౌడ్. రామచంద్రచారి. సీతారామారావు దేశ్పాండే, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## జంగమయ్య గుట్టలో వార్షికోత్సవాలు



జాతర ఉత్సవాల పోస్టరును విడుదల చేస్తున్న భక్తులు

**సదాశివపేట, జనవరి 31, ప్రభాతవార్త:**
సదాశివపేట మండలంలోని తంగడపల్లి గ్రామం శ్రీకోటిబిల్వలింగేశ్వర మఠం, శ్రీగురుగంగాధరమహాస్వామి ఆశ్రమం, జంగమయ్య గుట్ట 30వ వార్షికోత్సవానికి సంబంధించిన ఆహ్వానపత్రికను ఈరోజు వీరశైవసమాజం చౌకిమఠం సభ్యులకి ఆశ్రమపక్షాన జంగం మహేష్‌స్వామి అందజేశారు. ఫిబ్రవరి 2 నుండి ఫిబ్రవరి 8 వరకు సప్తాహం, నిత్య చండీహవనము, దేవీభాగవతపురాణము, సామూహిక హనుమాన్‌చాలీసా, అయ్యాచారదీక్షలు, గండజ్యోతి, పార్వతీపరమేశ్వరుల కళ్యాణం. వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

## మండల స్థాయి సిఎం కప్ పోటీలు

**-ప్రారంభించిన ఎఎంసి చైర్మన్**



పోటీలు ప్రారంభించి మాట్లాడుతున్న దృశ్యం

**బెజ్జంకి, జనవరి 31, ప్రభాతవార్త:**
బెజ్జంకి మండల కేంద్రంలో మండల స్థాయి సిఎం కప్ క్రీడా పోటీలను శనివారం జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో ఏఎంసి చైర్మన్ పులి కృష్ణ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని యువత క్రీడలపట్ల ఆసక్తిని కనబరచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సైతం పాల్గొవాలన్నారు. యువతలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసే వేదికనే ఈ సిఎంకప్ అని అన్నారు. ఈ క్రీడల్లో మండల వ్యాప్తంగా 200 మంది విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు, పోటీలో విజేతగా నిలిచినవారికి సోమవారం బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొల్లం శ్రీధర్ (పెద్దన్న), కల్లేపల్లి సర్పంచ్ బిగుళ్ళ మోహన్, ఎంపీడీవో ప్రవీణ్, మండల విద్యాధికారి మహతి లక్ష్మి, ఎస్సై సౌజన్య, ప్రధానోపాధ్యాయులు, యువకులతో పాటు తదితరులు ఉన్నారు.

## హద్నూర్‌లో కాల్వ తవ్వకంతో నీటి మళ్లింపు

**-రైతుల కష్టాలకు చెక్‌పెట్టిన సర్పంచి**



నీటి మళ్లింపుకు కాల్వలు తవ్విస్తున్న సర్పంచి ప్రవీణ్‌కుమార్

**న్యాల్‌కల్, జనవరి 31, ప్రభాతవార్త:**
వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు నిత్యం పడుతున్న కష్టాలకు గ్రామ సర్పంచి చెక్‌పెట్టారు. మండల పరిధిలోని హద్నూర్ గ్రామంలో చెలిమెగడ్డ వైపు ఉన్న వ్యవసాయ భూములకు పనులు చేసుకునేందుకు, పండిన చెరుకు పంటను కర్మాగారానికి, పంట దినుసులకు మార్కెట్‌కు, ఇంటికి తరలించుకునేందుకు రోడ్డుపై, రోడ్డుకు అటు ఇటూ వృథాగా నీరు నిలుస్తుండటంతో గ్రామరైతులు పడరానికష్టాలు పడుతూ సమస్యను గ్రామ సర్పంచి ప్రవీణ్‌కుమార్ దృష్టికి తీసుకురాగా స్పందించిన సర్పంచి జెసిబి సహాయంతో రైతులతో కలిసి నీటి మళ్లింపుకు కాల్వలను తవ్వించి వృథా నీరు కిందివాగులోకి పారేలా చర్యలుతీసుకున్నారు. సమస్యను పరిష్కరించిన సర్పంచికి గ్రామ రైతులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని సర్పంచి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

## న్యాల్‌కల్‌లో ప్రారంభమైన సిఎం కప్ క్రీడాపోటీలు



సిఎం కప్ పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు, కాంగ్రెస్ నేతలు

**న్యాల్‌కల్, జనవరి 31, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం సిఎం కప్ క్రకీడా పోటీలు ప్రారంభం అయ్యాయి. వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ పోటీలను అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ షాగుప్తా ఇఫ్సాత్, మండల విద్యాధికారి మారుతి రాథోడ్, ఎస్ఐ దోమ సుజిత్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ సిద్ధలింగయ్యస్వామి, డిసిసి ఉపాధ్యక్షులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, నాయకులు గార్లపల్లి శివరాజ్, ప్రవీణ్, కాశప్ప, ఇసాం పటేల్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## అక్రమ కేసులకు కెసిఆర్ భయపడరు

**-రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ కో-ఆర్డినేటర్ దేవి రవీందర్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవి రవీందర్

**గజ్వేల్, జనవరి 31 (ప్రభాతవార్త):**
మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌పై పెట్టిన అక్రమ కేసులకు భయపడరని రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ కో-ఆర్డినేటర్ దేవి రవీందర్ అన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కెసిఆర్‌పై గత రెండు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, కెసిఆర్‌పై అక్రమ కేసులు బనాయించాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ-కార్ రేసులో కెటిఆర్‌కు నోటీసులు పంపించి విచారణకు పిలిచి ఏమి సాధించారో రేవంత్‌రెడ్డికి తెలియాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దొబ్బెట భాస్కర్, మధుమోహన్, మాజీ సర్పంచ్‌లు బచ్చలి మహిపాల్, కిరణ్‌కుమార్, బిఆర్ఎస్ నాయకులు చిక్కుడు నరసింహులు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పాత పద్ధతిలోనే ఉపాధిహామీ పనులను కొనసాగించాలి

**-వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నర్సిములు**



కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

**సదాశివపేట, జనవరి 31, ప్రభాతవార్త:**
2005లో కేంద్రంలో యుపిఎ 1 ప్రభుత్వానికి వామపక్ష పార్టీల ఎంపిల మద్దతుతో వామపక్ష పార్టీలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఉద్యమ ఫలితంగా ఉపాధిహామీచట్టం రావడం జరిగిందని, ఈచట్టాన్ని పాతపద్ధతిలోనే కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయకార్మికసంఘం సదాశివపేట మండల కమిటీ ఆధ్వర్యంలో నిజాంపూర్ కొల్పూరు గ్రామాలలో ఉపాధిహామీ పనిప్రదేశాలను సందర్శించి కూలీలతో మాట్లాడడం జరిగింది. ఈసందర్భంగా తెలంగాణ వ్యవసాయకార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నర్సిములు మాట్లాడుతూ.. 2005 నుండి నేటి వరకు ఉపాధిహామీ చట్టంలో కూలీలు పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని, ఉపాధిహామీ చట్టంలో కూలీలకు లాభాలు ఉపయోగకరంగా ఉన్నటువంటి అంశాలను కేంద్రప్రభుత్వం కాలరాస్తుందని, ఉపాధిహామీ కూలీలకు ఉపయోగకరంగా ఉండేవాటిని కేంద్రప్రభుత్వం ఇవ్వడం లేదని మండిపడ్డారు. బెనిఫిట్స్ అన్నీ తొలగించి కూలీలపై భారం వేస్తూ ఉపాధిహామీ నుండి కూలీలను తొలగించే ప్రయత్నంలో భాగంగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం 2పూటలా ఫోటోలు దించడం, వర్క్‌డిమాండ్ ఇచ్చిన తర్వాత ఎమర్జెన్సీగా సోమవారం లేదా గురువారం పనులకు వెళ్లకుంటే ఆ వారం మొత్తం పనుల్ని కాన్సిల్ చేయడం, 100 రోజుల్లో 6రోజులు కట్‌చేయడం, ఆధార్ లింకు బేసుడ్‌గా పేమెంట్ చేయడం, నెలలు గడుస్తున్నా కూలీడబ్బులు ఇవ్వకపోవడం లాంటి ఇబ్బందులను పెట్టి కూలీలను పనుల నుండి దూరం చేసే చర్య చేపడుతుంది. దీనిని ప్రతికూలీ వ్యతిరేకించి కేంద్ర ప్రభుత్వం మెడలువంచే వరకు ఉద్యమించాలని అన్నారు. కొత్తగా 2025లో వచ్చిన విబిజిరామ్‌జి వలన కూలీలకు పైకి మంచిమాటలు చెబుతుందని అన్నారు. పాత పద్ధతిలోనే కూలీలకు ఉపాధిహామీ పద్ధతులను కొనసాగించాలని ఎం. నర్సిములు డిమాండ్ చేసారు.

## ఎన్నికలొచ్చాయి-40 లక్షల పన్నులు వసూలయ్యాయి

**జహీరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:**
మున్సిపల్ ఎన్నికలు రావడంతో మున్సిపాలిటీకి ఏకంగా 40లక్షల ఆస్తి పన్నులు (బకాయి పడ్డ పన్నులు) వసూలయ్యాయి. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ జారీకావడంతో కౌన్సిలర్‌గా పోటీచేసేవారు, అభ్యర్థి నామినేషన్‌కు బలపర్చేవారు తమ ఇంటి, పన్ను నీటి పన్నులు చెల్లించాల్సి ఉండటంతో పోటీచేసే ఆసక్తి ఉన్న అభ్యర్థులు వరుసక్రమంలో నిల్చొని తమ ఆస్తిపన్నులను చెల్లించుకున్నారు. 4రోజుల్లోనే మున్సిపాలిటీకి ఏకంగా 40లక్షల వరకు ఆస్తిపన్నులు వసూలయినట్లు మున్సిపల్ కమిషనర్ జైత్రం తెలిపారు. మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని 329 నామినేషన్లు వేసిన అభ్యర్థులతో పాటు బలపర్చినవారు ఆస్తిపన్నులను చెల్లించడంతో మున్సిపల్‌కు 40లక్షల ఆస్తి సమకూరిందని కమిషనర్ జైత్రం వివరించారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**-సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ పిలుపు**




సమ్మె నోటీసును అందిస్తున్న సిఐటియు నాయకులు

**సిద్దిపేట, ప్రభాతవార్త, ప్రతినిధి:**
కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12వ తేదీన జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికవర్గం అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేట కలెక్టరేట్‌లోని వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డిపిఓ కార్యాలయంలోని డిఎల్పి, డిఆర్‌డిఎ సూపరింటెండెంట్, జిల్లా విద్యాశాఖాధికారి సూపరింటెండెంట్ సమ్మె వినతిపత్రం అందించారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అమ్ముల బాలనర్సయ్య, గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కోశాధికారి చిట్యాల కనకయ్య, ఐకెపి వివోల యూనియన్ జిల్లా కార్యదర్శి తలపాక కిష్టయ్య, మధ్యాహ్నభోజన పథక కార్మిక యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బెల్లి రాజమణి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు మాచపురం రాజనర్సు, సిఐటియు నాయకులు మహేష్, రాజు, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గద్దర్ జయంతి

**కొమురవెల్లి, జనవరి 31, ప్రభాతవార్త:**
కొమురవెల్లి మండల కేంద్రంలో ప్రజా వాగ్గేయకారులు ప్రజా యుద్ధనౌక గద్దర్ 78వ జయంతి వేడుకలు తెలంగాణ సాంస్కృతిక సారథి కవి గాయకులు పిన్నింటి రత్నం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ గద్దర్ జయంతిని ప్రజాప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతోపాటు, ఆయన పేరుతో అవార్డును నెలకొల్పి ప్రతి యేటా కవులు, కళాకారులు, సినీ ప్రముఖులకు ప్రదానం చేయాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో కొమురవెల్లి ఉపసర్పంచ్ పోతుగంటి శ్రీనివాస్, ఉద్యమ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు పిన్నింటి దాసు, దేవస్థానం డైరెక్టర్లు సార్ల లింగం, బొచ్చు ఎల్లయ్యయాదవ్, మాజీ ఎంపిటిసి మేరుగు కృష్ణ, పిఎసిఎస్ మాజీడైరెక్టర్ బత్తిని నర్సింహులు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎరువుల రాజు, సెక్రటరీ ఉప్పల వంశీ, నాయకులు, పంజాల నర్సిములు, తీన్మార్‌మల్లన్న టీం నాయకులు పుట్ట రమేష్, పిన్నింటి కుమార్, గడ్డం పర్శరాములు, మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ రమేష్, కిష్టంపేట కుమార్, వెల్దె ఆంజనేయులు, గొల్లపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులను సమానత్వంగా చూడాలి

**మిరుదొడ్డి, జనవరి 31, ప్రభాతవార్త:**
దివ్యాంగులను సమానత్వంగా చూడాలని ఏపిడి సుధీర్, డిపిఎం విద్యాసాగర్, ఏపీఎం డాకాయ్య, సర్పంచ్ మహేశ్వరిలు అన్నారు. శనివారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ దివ్యాంగులకు సామాజిక, రాజకీయ, ఆర్థికజీవనంలో వారిభాగ్యస్వామ్యాన్ని పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ అర్జున్, ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఎంపీఓ ఫాహిం, శ్రీనిధి ఆర్ఎం, సీసీలు మనమ్మ, జ్యోతి, ఈశ్వరమ్మ, వరలక్ష్మి, బాలరాజు, ప్రభాకర్, అరుణ, శారద, భాగ్యలక్ష్మి, నర్సాగౌడ్, రాజేశ్వర్, మైసయ్య, బాబు, కొండల్‌రెడ్డి, నరేష్, వివిధ గ్రామాల దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## చిరుతపులి పాదాలు కావు

**-నిర్ధారించిన అటవీశాఖ అధికారులు**



పాదాల అచ్చులు పరిశీలిస్తున్న అధికారుల దృశ్యం

**అక్కన్నపేట, జనవరి 31, ప్రభాతవార్త:**
అక్కన్నపేట మండలం కేశనాయక్ తండ పరిధిలోని లచ్చానాయక్ తండ గుబ్బడి స్మశానవాటిక సమీపంలో చిరుతపులి పాదముద్రలు అన్ని స్థానికులు గుర్తించి శనివారం అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సాజిత్ పాషాతోపాటు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ దేవేందర్‌రెడ్డి వెళ్లి పరిశీలించగా, అవి చిరుతపులి పాదాలు కావని, అవి జాకాలు నక్కజాతికి చెందినవి అని నిర్ధారణ చేశారు. ప్రజలు ఎవరూ భయాందోళనలకు గురికావద్దని, ఎందుకైనా మంచిది గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళలో బావుల దగ్గరకు, పశువుల పాకల దగ్గరకు వెళ్లేవారు గుంపులుగా వెళ్లాలని సూచించారు.

## ఆకస్మికంగా వాహనాల తనిఖీ

**-తనిఖీలో పాల్గొన్న జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్**



వాహనాలను తనిఖీ చేస్తున్న జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్

**హుస్నాబాద్ రూరల్, జనవరి 31, ప్రభాతవార్త:**
హుస్నాబాద్ క్లస్టర్ పరిధిలోని అత్యవసర సేవల వాహనాలను ఉమ్మడి మెదక్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ బొయిని సంపత్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా 108 (అంబులెన్స్), 102 (తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్), 1962 (పశువైద్యసేవలు) వాహనాల్లోని వైద్యపరికరాల పనితీరును ఆయన నిశితంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది తమ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు మరింత మెరుగైన వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ఉచిత సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అత్యవసర సమయాల్లో ఈసేవలను ప్రజలు ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా వాహనాల సిబ్బంది రాజు, సతీష్, భగన్, రాజు (108), శ్రీధర్ (102), డాక్టర్ ప్రవళిక, సృజన్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కోసం పోరాడేవారే గద్దర్ నిజమైన వారసులు

**-టిజెఎసి నేత, రిటైర్డ్ ప్రిన్సిపాల్ పాపయ్య**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
ప్రజల కోసం పోరాడేవారే గద్దర్ నిజమైన వారసులు అని టిజెఎసి నేత, రిటైర్డ్ ప్రిన్సిపాల్ పాపయ్య అన్నారు. శనివారం ప్రజాయుద్ధనౌక గద్దర్ 78వ జయంతి సందర్భంగా సిద్దిపేటలోని పొన్నాల వైజంక్షన్ వద్ద గద్దర్ విగ్రహ ప్రతిపాదితస్థలంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ పాపయ్య మాట్లాడుతూ ప్రజలపక్షాన నిలబడి, ప్రజా పోరాటాలకు అండగా నినదించడమే గద్దర్‌కు మనమిచ్చే నివాళులు అన్నారు. విగ్రహనిర్మాణ కమిటీచైర్మన్ పోచబోయిన శ్రీహరియాదవ్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం స్మృతివనాన్ని ఏర్పాటుచేస్తానని రెండు సంవత్సరాలు గడిచినా ఆపేరే ఎత్తడం లేదన్నారు. కార్యక్రమంలో టిఎన్జీవో ప్రధాన కార్యదర్శి విక్రమ్‌రెడ్డి, మంజీరా రచయితల సంఘం నాయకులు సిద్ధంకి యాదగిరి, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు చంద్రం, శ్రీనివాసు, జగన్, మహేష్, రాములు, యాదగిరి, ఎల్లయ్య, రాములు, కుమార్, నరేందర్, శ్రీహరి, ఆకుల ప్రశాంత్, మోహన్, వెంకటేశం, ఆంజనేయులు, ఎల్లారెడ్డి, డి బిఎఫ్ నేత శంకర్, ప్రశాంత్, సంతోష్, రామచంద్రం, అక్బర్, ఆనంద్ తోపాటు స్థానిక సర్పంచ్ అమ్ముల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి విస్తరణ పనుల్లో వేగం పెంచండి

**-పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, జనవరి 31, ప్రభాతవార్త:**
బిహెచ్ఇఎల్ చౌరస్తా నుండి రుద్రారం గణేష్ గడ్డ మీదుగా సంగారెడ్డి వరకు చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణపనులు మందకొడిగా కొనసాగుతున్నాయని, సర్వీస్ రోడ్లు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వచ్చి ప్రధాన రహదారిపనులను చేపట్టాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ రహదారి సంస్థ అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామచంద్రాపురం, పటాన్‌చెరు, ముత్తంగి ప్రాంతాలలో రహదారి విస్తరణ పనులు చాలా ఆలస్యంగా జరుగుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. సర్వీస్ రోడ్లు అసంపూర్తిగా ఉండటం మూలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం తోపాటు వాహనదారులు ప్రమాదాలకు గురై చనిపోతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తమవైపు నుండి సంపూర్ణ సహకారం అందిస్తున్నా పనులు ఎందుకు పూర్తికావడం లేదని ఆయన ప్రశ్నించారు. రాబోయే నెలరోజుల్లోగా సర్వీస్‌రోడ్లు పూర్తి చేయాలని లేనిపక్షంలో ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. రహదారుల నిర్మాణసమయంలో ప్రభుత్వశాఖలతో ఇబ్బందులు ఎదురైతే సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని జాతీయ రహదారుల సంస్థ డిఈ రామకృష్ణను ఎమ్మెల్యే ఆదేశించారు.

## శని శక్తిధామ్ ఆలయంలో శనిత్రయోదశి పూజలు

**కంది, జనవరి 31, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ఎర్దనూర్ గ్రామంలో కొలువుండి భక్తులచే నిత్య పూజలందుకుంటున్న శ్రీశనిశక్తిధామ్ ఆలయంలో శనివారం శని త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకుని పూజాకార్యక్రమాలు నిర్వహించి తమమొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు వచ్చి, ఠాకూర్ సుధీర్ సింగ్, డాక్టర్ సునీల్ సింగ్, డాక్టర్ శక్తి సింగ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## ప్రారంభమైన న్యాల్‌కల్ ఉర్సే షీరీఫ్ జాతర

**-నేడు పశువుల జాతర-ఉత్తమ పశుపోషకులకు బసవ అవార్డులు**



బసవ అవార్డులు అందచేస్తున్న దృశ్యం (ఫైల్ ఫోటో)

**న్యాల్‌కల్, జనవరి 31, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామశివారులోని కొండగట్టుపై కొలువున్న ఉర్సే షీరీఫ్ ఫీర్ గైబ్ సాహెబ్ జాతర ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. వారంరోజుల పాటు కొనసాగే జాతర ఉత్సవాలకు ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు చేరుకుని దర్గాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటూ ఉంటారు. జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పశువుల జాతర జరుగుతుంది. వేలసంఖ్యలో తరలివచ్చే పశువులను రైతులు కొనుగోలు అమ్మకాలు చేస్తూ ఉంటారు. కోట్లరూపాయల్లో వ్యాపారం కొనసాగుతుంది. జాతరకు వచ్చిన పశువులలో మేలైన పశువులను ఎంపిక చేసి పశుపోషకులకు న్యాల్‌కల్ గ్రామానికి చెందిన శిల్పకళాకారుడు, డాక్టర్ హోతి బస్వరాజ్ తన తల్లిదండ్రుల, అన్నకుమారుడి జ్ఞాపకార్థం రైతులకు బసవ అవార్డులతో బహుమతులు అందచేస్తూ వస్తున్నారు.

## రోడ్డు భద్రత నియమాలను తప్పకుండా పాటించాలి

**-చేర్యాల సిఐ రమేష్**




రోడ్డు భద్రత మాసం ముగింపు కార్యక్రమంలో సిఐ రమేష్

**చేర్యాల, జనవరి 31, ప్రభాతవార్త:**
రోడ్డు భద్రత నియమాలను తప్పకుండా పాటించాలని చేర్యాల సిఐ రమేష్ తెలిపారు. రోడ్డు భద్రత మాసం 2026 (జనవరి1 నుండి 31)నాటికి ముగుస్తున్న సందర్భంగా శనివారం పట్టణంలోని పంచతంత్ర పాఠశాల విద్యార్థులు పాతబస్టాండ్ కూడలిలో ప్లకార్డులు పట్టుకుని స్లోగన్స్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా సిఐ రమేష్ పాల్గొని మాట్లాడుతూ తలకు హెల్మెట్ ధరించాలని అదే విధంగా ఫోర్ వీలర్ వాహనంలో ప్రయాణించే సమయంలో సీటు బెల్ట్ పెట్టుకుని వాహనాలు నడపాలని మీ తల్లిదండ్రులు మరవకుండా చూడాలని విద్యార్థులకు సూచించారు. అదే విధంగా విద్యార్థులు కూడా రోడ్డు దాటే సమయంలో కూడా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## పౌరహక్కుల పరిరక్షణకు పాటుపడాలి



పౌరహక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కష్టయ్య

**చౌటకూరు, జనవరి 31, ప్రభాతవార్త:**
పౌర హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని వతహసీల్దార్ నామాల కిష్టయ్య సూచించారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ కిష్టయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ఆలయాల ప్రవేశాలను నిషేధిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ సూరేపల్లి అనుదీప్, వ్యవసాయ అధికారి ప్రవీణ, సీనియర్ అసిస్టెంట్ మల్లేశం, గిర్దావరర్-2 లింగాగౌడ్, జీపీఓలు నాయికోటి సత్యనారాయణ, సమీర, బైండ్ల రమేష్, యువజన సంఘాలనాయకులు మంగలి చిన్నయ్య, మాజీ ఉపసర్పంచ్ కలాలి రామాగౌడ్, వార్డుసభ్యులు దప్పు అశోక్, చక్రపాణి పాల్గొన్నారు.

## పట్టుదలతో కృషితో విజయం తథ్యం

**-జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ వసంతకుమారి**



విజేతలకు బహుమతులు అందచేస్తున్న వసంత కుమారి

**చౌటకూరు, జనవరి 31, ప్రభాతవార్త:**
పట్టుదలతో కృషి చేస్తే విజయం సాధించడం తథ్యమని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు, మండల ప్రత్యేక అధికారి వసంతకుమారి అన్నారు. మండల కేంద్రమైన చౌటకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న సిఎం కప్-2025 క్రీడోత్సవాలు శనివారంతో ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి వసంతకుమారి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. చౌటకూరుసర్పంచి పార్కుల రాంరెడ్డి సిఎంకప్ క్రీడల నిర్వహణకు 20వేల రూపాయలను, సరాఫ్‌పల్లి సర్పంచి నందికంటి రామచంద్రారెడ్డి, ఉప్పరిగూడెం సర్పంచ్ గొల్ల మల్లేశంలు తలా5వేల రూపాయలను అందచేశారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంఈఓ అనురాధ, పీఆర్టీయూ టిఎస్ మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి, ఎంపిఓ సువర్ణ, సర్పంచ్‌లు నందికంటి రామచంద్రారెడ్డి, జైపాల్‌నాయక్, గొల్ల మల్లేశం, పీడి అరుణ, పీఈటీలు గాండ్ల రాజు, కొల్కూరి నగేశ్, మాజీ ఉపసర్పంచ్ కలాలి రామాగౌడ్, వర్కల రమేశ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యలకు చెక్ పెడుతున్న సర్పంచి

**అక్కన్నపేట, జనవరి 31, ప్రభాతవార్త:**
మండలంలోని తారచంద్ తండా గ్రామంలో ఇంటింటికి వెళ్లే నల్లా మోటరు కాలిపోవడంతో ప్రజలు తాగునీటికోసం ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న పంతులుతండా గ్రామసర్పంచ్ లావుడియా చిన్నా నాయక్ వెంటనే బోరు మోటర్ వద్దకు వెళ్లి పరిశీలించి అధికారులతో మాట్లాడి మోటార్ రిపేర్‌చేయించి తాగునీటిసమస్యను పరిష్కరించారు. గ్రామంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు.